విశాఖపట్టణం
మంగళవారం 6 అక్టోబర్ 2026

For a pure tomorrow..

# జయ జయహే

epaper.jayajayahey.com | సంపుటి: 9 | సంచిక: 235 | వెల: రూ.5/- | పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool




2

## 15 ఏళ్లలో దేశంలో 100 బిలియన్ డాలర్ల పెట్టుబడులు

భారత్- స్విస్ ద్వైపాక్షిక చర్చల వేళ ప్రకటించిన ప్రధాని మోదీ

# సుపారీపై జగన్ సమాధానం చెప్పాలి

అంతిమ లబ్ధిదారు ఎవరో తేలిపోయింది

నాపై నారాసుర రక్తచరిత్ర పేరిట దుష్ప్రచారం

నిప్పుతో చెలగాటం ఆడితే కాలిపోవడం ఖాయం

సీఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలు





(ప్రొద్దుటూరు -జయజయహే)

కడప జిల్లా పర్యటనలో సీఎం చంద్రబాబు మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసుపై కీలక వ్యాఖ్యలు చేశారు. వివేకా హత్య కేసు విచారణలో వాస్తవాలన్నీ బయటకు వచ్చాయని, ఈ దారుణానికి పాల్పడిన అంతిమ లబ్ధిదారులు ఎవరో స్పష్టంగా తేలిపోయిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. రూ. 40 కోట్ల సుపారీ ఒప్పందంపై గొడ్డలి పార్టీ అధినేత జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆనాడు ఆ హత్య నిందను తనపై మోపి, సొంత పత్రికలో 'నారాసుర రక్తచరిత్ర' అని అబద్ధపు కథనాలు రాశారని చంద్రబాబు గుర్తుచేశారు. నిజం నిప్పులాంటిదని, నిప్పుతో చెలగాటమాడితే ఎప్పటికైనా కాలిపోవడం ఖాయమని వ్యాఖ్యానించారు. అలాగే రాష్ట్రంలో జరిగిన లిక్కర్ స్కాంలో వేల కోట్లు దోచుకున్న అంతిమ లబ్ధిదారుల వేళ్లు కూడా ఆ పార్టీ అధినేత వైపే చూపిస్తున్నాయని, దీనిపై సమాధానం చెప్పే ధైర్యం ఉందా అని సభ వేదికగా చంద్రబాబు సవాల్ విసిరారు.

వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరులో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌లతో కలిసి జల జీవన్ మిషన్ 2.0 – అమరజీవి జలధార పథకానికి సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడే పైలాన్‌ను ఆయన ఆవిష్కరించారు. గోదావరి, కృష్ణా నదులను అనుసంధానం చేసి జలహారతి ఇచ్చే బాధ్యత తమ ప్రభుత్వం తీసుకుంటుందని చంద్రబాబు స్పష్టం చేశారు. గోదావరి పుష్కరాల కంటే ముందే ఏపీకి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేసి, ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. గోదావరి– కావేరి నదుల అనుసంధానం తన ముఖ్య కోరిక ..మిగతా 2లో




## ఆ రికార్డులు మా ముందుంచండి

అసలు బాధ్యులెవరో తేల్చుతాం

ఫారం 6లో స్వరూపం మార్పుపై ఈసీ ఆమోదం లేనేలేదు

ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ

ఎస్ఐఆర్ ప్రక్రియ పిటీషన్లపై సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

ఓటర్ల నమోదు కోసం ఉపయోగించే చట్టబద్ధమైన ఫారం–6లో చేసిన మార్పులపై అత్యున్నత న్యాయస్థానం తీవ్రంగా స్పందించింది. ఆన్‌లైన్ పోర్టల్‌లో ఫారం–6 స్వరూపాన్ని మార్చడంపై తాము ఎలాంటి ఆమోదం తెలపలేదని సుప్రీంకోర్టు సోమవారం తేల్చిచెప్పింది. కేంద్ర ఎన్నికల సంఘం తమ ఈసీఐనెట్ , ఈఆర్ఓనెట్ పోర్టల్‌లో ఆన్‌లైన్ ఫారం–6ను ఏకపక్షంగా సవరించిందంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణ చేపట్టిన ధర్మాసనం.. అసలు ఈ మార్పులకు ఎవరు బాధ్యులో పరిశీలిస్తామని వ్యాఖ్యానించింది. ఈ మేరకు సంబంధిత రికార్డులను సమర్పించాలని ఆదేశిస్తూ కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్,..మిగతా 2లో

# సుప్రీంలో వైసీపీ సవాల్

స్థానిక ఎన్నికలకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ పై పిటీషన్

శుక్రవారం విచారణకు వచ్చే అవకాశం

(తాడేపల్లి - జయజయహే)

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి హైకోర్టు తీర్పుపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. వార్డుల విభజన, స్థానిక ఎన్నికల నిర్వహణకు అనుకూలంగా హైకోర్టు ఇటీవల తీర్పును వెలువరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ వైసీపీ సోమవారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌లో రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను ప్రతివాదిగా చేర్చింది. పిటిషన్ దాఖలు చేసిన వెంటనే వైసీపీ తరఫు న్యాయవాది సీజేఐ ..మిగతా 2లో



## కొత్తగా నాలుగు పోలీసు కమిషనరేట్లు

తిరుపతి, కర్నూలు, గుంటూరు, రాజమహేంద్రవరం ఏర్పాటు

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం




3




## విశాఖలో రక్షణమంత్రి రాజ్‌నాథ్

షిప్ యార్డులో నేడు మహత్తర ఘట్టం

పలు నిర్మాణాలు, శంకుస్థాపనలకు శ్రీకారం

(విశాఖపట్నం - జయజయహే)

హిందుస్థాన్ షిప్‌యార్డులో భారత నౌకాదళానికి ఊతమిచ్చేలా నిర్మాణం పూర్తైన, నిర్మాణ దశలో ఉన్న పలు ప్రారంభోత్సవాలతో పాటు శంకుస్థాపనలకు మంగళవారం విశాఖ వేదిక కానుంది. ఈ మహత్తర ఘట్టాన్ని కేంద్ర రక్షణ శాఖమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చేతుల మీదుగా జాతికి అంకితం చేయడానికి రక్షణ ఉత్పత్తుల విభాగం(హెచ్ఎస్–ఎల్) ఏర్పాట్లు చేసింది. ఇందులో పాల్గొనేందుకు రాజ్‌నాథ్‌సింగ్ ఇవాళ సాయంత్రం విశాఖలోని ఐఎన్ఎస్ డేగాకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ స్వాగతం పలికారు. జాతీయ స్థాయి ..మిగతా 2లో

# అక్టోబర్‌లో హీట్ ఐలాండ్

రికార్డు స్థాయిలో వేడిమి ఉష్ణోగ్రతలు నమోదుకు ఛాన్స్

ఇప్పటికే రుతుపవనాల ఉపసంహరణ

వాయు పీడన వ్యవస్థలో కీలక మార్పులు

నగరాల్లో దారుణంగా పేరుకుపోయిన వేడిమి కారణాలు

వాతావరణ శాఖ అంచనాలు



(ప్రత్యేక ప్రతినిధి, జయజయహే)

రుతుపవనాలు వెనుదిరిగిన తర్వాత వాతావరణం క్రమంగా చల్లబడుతుందని సాధారణంగా భావిస్తాం. కానీ ఈ ఏడాది అక్టోబర్ ప్రారంభంలో అందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఉత్తర భారతదేశంలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిల కంటే ఎక్కువగా నమోదవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 35 డిగ్రీల సెల్సియస్‌ను దాటుతుండగా.. శనివారం (అక్టోబర్ 03) 37.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. గత రెండేళ్లలో ఇదే అత్యంత వేడి అక్టోబర్ రోజుగా నమోదైనట్లు సమాచారం. ఆదివారం (అక్టోబర్ 04) కూడా 36.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఇది సాధారణం కంటే దాదాపు రెండు డిగ్రీలు ఎక్కువ. ఈ పరిస్థితినే సాధారణంగా 'అక్టోబర్ హీట్'గా పిలుస్తారు. అయితే అక్టోబర్‌లో వేడి పెరగడానికి ఒకే ఒక్క కారణం ఉండదు. రుతుపవనాల ఉపసంహరణ, వాయు పీడన వ్యవస్థల్లో మార్పులు, అధిక తేమ, నిర్మలమైన ఆకాశం, బలమైన సూర్యకిరణాలు, నగరాల్లో వేడి పేరుకుపోవడం వంటి అనేక అంశాలు కలిసి ఈ పరిస్థితికి కారణమవుతాయి.రుతుపవన కాలంలో ఉత్తర భారత మైదాన ప్రాంతాలపై అల్పపీడన వ్యవస్థలు ఏర్పడుతుంటాయి. ఇవి తేమతో కూడిన గాలులు, మేఘాలను ..మిగతా 2లో

## లోకేశ్‌తో గోల్డ్ మెడల్ విన్నర్ జ్యోతి సురేఖ భేటీ

దేశానికి గర్వకారణంగా నిలిచారని అభినందనలు

2



# సుపారీపై జగన్ సమాధానం చెప్పాలి

మొదటి పేజీ తరువాయి...

అని, కరవు పరిస్థితుల్లో 200 టీఎంసీల విలువైన జలాలు సముద్రంలోకి వృథాగా వెళ్లిపోయాయని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. గోదావరి-కావేరి అనుసంధానం పూర్తయితే కనుక రాయలసీమలో నీటి సమస్యే ఉండదని అంచనా వేశారు. జల్ జీవన్ మిషన్.. అమరజీవి జలధార పథకం ద్వారా వచ్చే రెండు సంవత్సరాల్లో దాదాపు రూ. 30,000 కోట్లు ఖర్చు చేసి 90 లక్షల కుటుంబాలకు సురక్షితమైన తాగునీరు అందిస్తామన్నారు.



### కూటమి హయాంలోనే సీమ అభివృద్ధి

గడిచిన రెండేళ్లలోనే రాయలసీమ అభివృద్ధికి ఎన్డీయే కూటమి ప్రభుత్వం రూ. 24,000 కోట్లు ఖర్చు చేయగా, గత వైసీపీ ప్రభుత్వం అయిదేళ్లలో కేవలం రూ. 2,500 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. గత ప్రభుత్వ విధ్వంసకర పాలనకు పల్లెలు కన్నీళ్లు పెట్టుకున్నాయన్నారు. వారి హయాంలో రోడ్లన్నీ గుంతలమయంగా మారాయని, ఏ సమస్య తీరలేదన్నారు. తమ కూటమి ప్రభుత్వంలో అభివృద్ధిలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తనదైన ముద్ర వేస్తున్నారని అభినందించారు. ఇటీవల రాయలసీమలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ నిర్మాణాలకు శంకుస్థాపన చేసినట్లు గుర్తు చేశారు. రాయలసీమ దశ, దిశ మార్చిన ఘనత తమ కూటమి ప్రభుత్వానిదేనని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## ఆ రికార్డులు మా ముందుంచండి

మొదటి పేజీ తరువాయి...



జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. న్యాయవాది శైలేంద్ర మణి త్రిపాఠి దాఖలు చేసిన పిటిషన్ తరఫున సీనియర్ అడ్వకేట్ మేనకా గురుస్వామి వాదనలు వినిపించారు. ఢిల్లీ సహా పలు రాష్ట్రాల్లో జరిగిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో నిబంధనలకు విరుద్ధంగా అదనపు షరతులను జోడించారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. "సవరించిన ఫారం-6కి మేము ఎలాంటి ఆమోదం ఇవ్వలేదని స్పష్టంగా చెబుతున్నాం. రికార్డులు కోర్టు ముందుకు వచ్చినప్పుడు అసలు ఈ మార్పులు ఎవరు చేశారో చూస్తాం" అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు.

### అసలేమిటీ ఫారం-6 వివాదం?

ఓటర్ల జాబితాలో కొత్తగా పేరు చేర్చుకోవాలనుకునే పౌరులు చట్టబద్ధంగా సమర్పించే దరఖాస్తునే 'ఫారం-6' అంటారు. అయితే, ఇటీవల చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియ సందర్భంగా పోర్టల్‌లోని ఆన్‌లైన్ ఫారమ్‌లో ఈసీ కొన్ని అదనపు నిబంధనలను చేర్చింది. జులై నెలలో చేసిన మార్పుల ప్రకారం.. గతంలో జరిగిన ఎస్ఐఆర్ ఓటర్ల జాబితాలో దరఖాస్తుదారు పేరు గానీ, లేదా వారి తల్లిదండ్రులు, తాతముత్తాతల పేర్లు గానీ ఉన్నాయో లేదో వెల్లడించాలని ఆన్‌లైన్ ఫారంలో కొత్త సెక్షన్‌ను చేర్చారు. ఈ ప్రశ్నలకు సమాధానం ఇస్తేనే దరఖాస్తు ప్రక్రియ పూర్తయ్యేలా ఆన్‌లైన్ వ్యవస్థను సవరించారు. ఈ మార్పుపై ఎన్నికల సంఘం లోపలే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. 1960 నాటి ఓటర్ల నమోదు నిబంధనల ప్రకారం ఫారం-6 నిబంధనలను నిర్ణయిస్తారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం 1950 లోని సెక్షన్ 28 ప్రకారం నిబంధనలను సవరించాలంటే కేంద్ర ప్రభుత్వం ఎన్నికల సంఘాన్ని సంప్రదించి, పార్లమెంట్ ముందు ఉంచాలి. అటువంటి చట్టబద్ధమైన ప్రక్రియను అనుసరించకుండా కేవలం ఆన్‌లైన్ ఫారంను మార్చే అధికారం లేదని ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి రికార్డుపూర్వకంగా అభ్యంతరం తెలిపారు. అయితే, ఇది కేవలం ఎస్ఐఆర్ ప్రక్రియ వరకేనని, చట్టబద్ధమైన ఫారం-6ను సవరించలేదని ఈసీ సమర్థించుకుంది.

### ఓటర్లపై పడుతున్న ప్రతికూల ప్రభావం

అనేక దశాబ్దాల క్రితం ఎస్ఐఆర్ జరిగిన రాష్ట్రాల్లో ఈ నూతన నిబంధన తీవ్ర చిక్కులకు దారితీసింది. ఇప్పుడే 18 ఏళ్లు నిండిన కొత్త ఓటర్లకు 2000ల ప్రారంభంలో జరిగిన ఎస్ఐఆర్‌లో పేర్లు ఉండే అవకాశం లేదు. దీంతో వారు తమ తల్లిదండ్రులు లేదా తాతముత్తాతల పేర్లతో బంధుత్వాన్ని నిరూపించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు, దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఎస్ఐఆర్ నిర్వహణ ద్వారా ముసాయిదా జాబితాల నుంచి దాదాపు 13 కోట్లకు పైగా పేర్లను తొలగించారు. ఆ జాబితాలో పేర్లు పోగొట్టుకున్న పౌరులు మళ్లీ నమోదు చేసుకోవడానికి ప్రయత్నిస్తే.. 'తొలిసారిగా అప్లై చేస్తున్నాను' అని ఫారం-6లో డిక్లరేషన్ ఇవ్వాల్సి రావడం వివాదాస్పదమైంది.

### నిరసనల వేళ ఈసీ నిర్ణయం..

వివాదం తీవ్రరూపం దాల్చడంతో, ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయిన రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఆన్‌లైన్ ఫారం నుంచి ఈ అదనపు నిబంధనలను ఎన్నికల సంఘం ఉపసంహరించుకుంది. సెప్టెంబరు 26న స్పష్టీకరణ ఇస్తూ, ఎస్ఐఆర్ కాలంలో మాత్రమే అదనపు నిబంధనలు వర్తిస్తాయని, మిగిలిన సమయంలో 1960 నిబంధనల ప్రకారమే ఫారం-6 ఉంటుందని తెలిపింది. ఢిల్లీ, పశ్చిమ బెంగాల్‌లో సుమారు 16 లక్షల అపీళ్లు ట్రిబ్యునళ్ల ముందు పెండింగ్‌లో ఉన్నాయని సీనియర్ అడ్వకేట్ మేనకా గురుస్వామి వాదించారు. ఈ పిటిషన్‌ను సీఈసీ జ్ఞానేష్ కుమార్ ఏకపక్ష వైఖరిపై దాఖలైన రాకేష్ కుమార్ సింగ్ పిటిషన్‌తో ట్యాగ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. సీఈసీ ఏకపక్ష నిర్ణయాలపై దాఖలైన పిటిషన్‌లో కేంద్రం, ఈసీలకు నోటీసులు ఇస్తూనే, సీఈసీ విధులపై ఎలాంటి మధ్యంతర స్టే ఇచ్చేందుకు కోర్టు నిరాకరించింది. చట్టబద్ధమైన విధానాలను పాటించారా లేదా అనేది రికార్డులను పరిశీలించిన తర్వాతే తేలుస్తామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

## విశాఖలో రక్షణమంత్రి రాజ్‌నాథ్



మొదటి పేజీ తరువాయి...

పోటీని తట్టుకొని ఐదు ఫ్లీట్ సపోర్టు షిప్‌ల తయారీ ఆర్డరుని షిప్‌యార్డు దక్కించుకుంది. వీటిలో రెండింటిని తిరిగి ఎల్‌అండ్‌టీకి అప్పగించింది. షిప్‌యార్డులో నిర్మాణ దశలో ఉన్న తొలి ఫ్లీట్ సపోర్టు షిప్(ఎఫ్ఎస్ఎస్)నకు 81 టన్నుల అత్యధిక బరువుతో నిర్మించిన ప్రొఫెల్లర్ కూడా కంపెనీ రికార్డుగానే ఇటీవల యాజమాన్యం ప్రకటించుకుంది. ఈ ఎఫ్ఎస్ఎస్‌ను డాక్‌లోనే ఫ్లోట్ చేయడం అలాగే ఇదే సిరీస్‌లో ఆఖరు ఎఫ్ఎస్ఎస్ పనులు కూడా అదే సమయంలో ప్రారంభించనున్నారు. స్లిప్‌వే బెర్తును ప్రారంభించనున్న రాజ్‌నాథ్ : సాధారణంగా ఫుట్‌బాల్ మైదానం పొడవు 90 నుంచి 110 మీటర్ల వరకు ఉంటుంది. రెండు సంవత్సరాల కిందట పురాతన స్లిప్‌వే బెర్తులు రెండింటిని పూర్తిగా తొలగించారు. ఎప్పుడో పాత కాలంనాటి నౌకల పొడవులకు అనుగుణంగా చిన్నవిగా ఉండే షిప్‌లను నిర్మించేవారు. ప్రస్తుతం మారుతున్న అవసరాల మేరకు భారీ షిప్‌లను నిర్మించేందుకు ముందస్తు వ్యూహంగా ఏకంగా రెండు ఫుట్‌బాల్ మైదానాలంత పొడవుతో రూ.280 కోట్లు వెచ్చించి స్లిప్‌వే బెర్తు తీర్చిదిద్దారు. ఈ బెర్తును కూడా రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ప్రారంభించనున్నారు.

ఐదేళ్ల కిందట ప్రారంభానికి నోచుకోకుండానే ఒక కొత్త భారీ క్రేను ఒకటి ట్రయల్స్‌లోనే కుప్పకూలిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే యార్డు ఆధునికీకరణ పనుల్లో భాగంగా రూ.300 కోట్లు వెచ్చించి భారీ గొలియాత్ (క్రేను) ఏర్పాటు చేశారు. దీనికి కూడా వివిధ దశల్లో అధిక బరువును ఎత్తినా కూడా తట్టుకుని నిలబడేలా దీన్ని తీర్చిదిద్దారు. 300 టన్నుల బరువుగల క్రేనును రాజ్‌నాథ్‌సింగ్ ప్రారంభిస్తారు. మరోవైపు రాజ్‌నాథ్‌సింగ్ పర్యటన సందర్భంగా డాక్‌లోని నౌకలు, క్రేను, స్లిప్‌వే బెర్తుల పరిసరాలకు ఎవరినీ వెళ్లకుండా సంస్థ భద్రతను కట్టుదిట్టం చేశారు. గుర్తింపు కార్డులు లేకుండా అనుమతించడం లేదు. సంస్థలోకి రాకపోకలు సాగిస్తున్న అన్ని రకాల వాహనాలను తనిఖీ చేసిన తర్వాతే అనుమతిస్తున్నారు. అలాగే రక్షణ మంత్రిని కలిసేందుకు ముందుగానే ఎంపిక చేసిన కార్మిక సంఘాల సభ్యులకు మాత్రమే ప్రత్యేక అనుమతులిచ్చారు.

## సుప్రీంలో వైసీపీ సవాల్



మొదటి పేజీ తరువాయి...

జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం ముందు ఈ అంశాన్ని ప్రస్తావించారు. ఇదే అంశానికి సంబంధించి మరో పిటిషన్ కూడా దాఖలైందని, అది శుక్రవారం విచారణకు వచ్చే అవకాశం ఉందని ధర్మాసనం తెలిపింది. అయితే, ఏ క్షణంలోనైనా ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉన్నందున, అంతకంటే ముందే తమ పిటిషన్‌పై విచారణ చేపట్టాలని వైసీపీ తరఫు న్యాయవాది కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అమలు, వార్డుల పునర్విభజన వంటి అంశాలపై గత కొంతకాలంగా రాష్ట్రంలో రాజకీయ, న్యాయపరమైన ఉత్కంఠ కొనసాగుతోంది. స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల శాతాన్ని ఖరారు చేసే విషయంలో, ముందస్తుగా చేపట్టిన కసరత్తుపై పలు విమర్శలు వ్యక్తమయ్యాయి. గతంలో బీసీ రిజర్వేషన్లు, ఎన్నికల ప్రక్రియకు సంబంధించి హైకోర్టులో వాదనల తర్వాతే ఈ తీర్పు వెలువడింది. ఈ తీర్పు ద్వారా ఎన్నికల నిర్వహణకు మార్గసుగమం కాగా, తాజాగా వైసీపీ ఈ తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేయడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఎన్నికల షెడ్యూల్ వెలువడే ముందే అత్యున్నత ధర్మాసనం ఈ పిటిషన్‌పై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34% రిజర్వేషన్లు కల్పిస్తూ ఏపీ ప్రభుత్వం ఇటీవల జీవోలు 105, 1065లను జారీ చేసింది. ఈ జీవోలను హైకోర్టు కొట్టివేసింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై ఈ వారం విచారణ జరిగే అవకాశం ఉంది.

## అక్టోబర్‌లో హీట్ ఐలాండ్

మొదటి పేజీ తరువాయి...

ఆకర్షించడంతోపాటు వర్షాలకు అనుకూల పరిస్థితులను కల్పిస్తాయి. దీంతో ఉష్ణోగ్రతలు కొంత నియంత్రణలో ఉంటాయి. అయితే రుతుపవనాలు క్రమంగా వెనుదిరిగే సమయంలో ఈ అల్పపీడన వ్యవస్థ బలహీనపడుతుంది. దాని స్థానంలో అధిక పీడన పరిస్థితులు ఏర్పడవచ్చు. అధిక పీడన ప్రాంతాల్లో గాలి పైకి ఎగరడానికి బదులుగా కిందికి దిగుతుంది. ఈ ప్రక్రియను 'సబ్సిడెన్స్' అంటారు. దీనివల్ల వాతావరణంలో స్థిరత్వం పెరిగి, మేఘాల ఏర్పాటుకు అవకాశాలు తగ్గుతాయి. ఫలితంగా సూర్యరశ్మి నేరుగా భూమిని తాకి పగటి ఉష్ణోగ్రతలు పెరగవచ్చు. అక్టోబర్ వేడి మరింత ఇబ్బందికరంగా అనిపించడానికి నేలలో ఉన్న తేమ కూడా ఒక కారణం. నెలల తరబడి కురిసిన రుతుపవన వర్షాలతో నేలలో గణనీయమైన తేమ నిల్వ ఉంటుంది. వర్షాలు తగ్గిపోయిన తర్వాత కూడా ఈ తేమ నుంచి నీటి ఆవిరి వాతావరణంలోకి చేరుతుంది. ఆకాశం నిర్మలంగా ఉన్నప్పుడు సూర్యకిరణాలు తడి నేలను వేడెక్కిస్తాయి. దీంతో బాష్పీభవనం పెరిగి గాలిలో తేమ అధికమవుతుంది. ఫలితంగా థర్మామీటర్‌పై నమోదయ్యే ఉష్ణోగ్రత కంటే బయట వాతావరణం మరింత వేడిగా, ఉక్కపోతగా అనిపిస్తుంది. నీటి ఆవిరి కూడా హరితగృహ వాయువుగా పనిచేస్తుంది. భూమి నుంచి వెలువడే పరారుణ వికిరణంలో కొంత భాగాన్ని ఇది గ్రహిస్తుంది. దీంతో రాత్రివేళ భూమి త్వరగా చల్లబడకుండా ఉండే పరిస్థితి ఏర్పడుతుంది. అందుకే అక్టోబర్‌లో కొన్ని ప్రాంతాల్లో రాత్రులు కూడా సాధారణం కంటే వెచ్చగా అనిపించవచ్చు.

### సూర్యుడి ప్రభావం ఇంకా తగ్గదు!

సెప్టెంబర్‌లో విషువత్తు తర్వాత సూర్యుడి ప్రత్యక్ష స్థానం దక్షిణ దిశగా కదులుతున్నప్పటికీ.. భారత ఉపఖండంపై అక్టోబర్ ప్రారంభంలో సౌర వికిరణం ఇంకా గణనీయంగానే ఉంటుంది. రుతుపవనాల సమయంలో ఉండే దట్టమైన మేఘాలు తగ్గిపోవడంతో సూర్యకిరణాలు నేరుగా భూమిని చేరుతాయి. దీంతో పగటి సమయంలో భూమి ఉపరితలం వేగంగా వేడెక్కుతుంది. ముఖ్యంగా నిర్మలమైన ఆకాశం ఉన్న ప్రాంతాల్లో ఈ ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుంది. ఉత్తర భారతదేశంలో వాతావరణాన్ని ప్రభావితం చేసే మరో అంశం పశ్చిమ అవాంతరాలు. ఇవి సాధారణంగా మధ్యధరా సముద్ర ప్రాంతం నుంచి వచ్చే వాతావరణ వ్యవస్థలు. కొన్ని సందర్భాల్లో ఇవి ఉత్తర భారతదేశానికి చల్లటి గాలులు, మేఘాలు, వర్షాలను తీసుకొస్తాయి. అక్టోబర్ ప్రారంభంలో వీటి కార్యకలాపాలు బలహీనంగా ఉంటే.. మేఘాలు, వర్షాలు, చల్లటి గాలుల ప్రభావం తగ్గుతుంది. దీంతో వేడి పరిస్థితులు మరింత స్పష్టంగా కనిపించవచ్చు.

### నగరాల్లో 'హీట్ ఐలాండ్' ప్రభావం!

అక్టోబర్ వేడి పట్టణ ప్రాంతాల్లో మరింత తీవ్రంగా అనిపించడానికి అర్బన్ హీట్ ఐలాండ్ ప్రభావం కూడా కారణం. కాంక్రీట్ భవనాలు, తారు రోడ్లు, ఇతర నిర్మాణాలు పగటిపూట సూర్యుడి వేడిని అధికంగా గ్రహిస్తాయి. సూర్యాస్తమయం తర్వాత ఆ వేడిని నెమ్మదిగా విడుదల చేస్తాయి. దీంతో నగరాలు చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాల కంటే ఎక్కువగా వేడిగా ఉండే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా రాత్రివేళ ఉష్ణోగ్రతలు త్వరగా తగ్గకపోవడానికి ఇది ఒక కారణం. మొత్తంగా చూస్తే.. అక్టోబర్ వేడికి ఒకే కారణాన్ని చూపించడం సరికాదు. ఇది రుతుపవనాల నుంచి రుతుపవనానంతర కాలానికి మారుతున్న సమయంలో ఏర్పడే అనేక వాతావరణ పరిస్థితుల కలయిక. రుతుపవనాల ఉపసంహరణ, అధిక పీడనం, నిర్మలమైన ఆకాశం, బలమైన సూర్యరశ్మి, నేలలో మిగిలిన తేమ, అధిక ఆర్ద్రత, బలహీనమైన పశ్చిమ అవాంతరాలు, పట్టణీకరణ కారణంగా వేడి పేరుకుపోవడం వంటి అంశాలు కలిసి అక్టోబర్‌లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా ఉండేలా చేయవచ్చంటున్నారు వాతావరణ నిపుణులు.

అందుకే రుతుపవనాలు ముగిసిన వెంటనే చల్లటి వాతావరణం వస్తుందని భావించకుండా.. అక్టోబర్ ప్రారంభంలో కూడా వేడి, ఉక్కపోత నుంచి జాగ్రత్తలు తీసుకోవడం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా పగటి వేళల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే ప్రాంతాల్లో తగినంత నీరు తాగడం, అవసరం లేని సమయంలో ఎండలో బయటకు వెళ్లకపోవడం, వృద్ధులు, చిన్నారులు, ఇతర సున్నిత వర్గాలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవడం మంచిది.

## లోకేశ్‌తో గోల్డ్ మెడల్ విన్నర్ జ్యోతి సురేఖ భేటీ



### దేశానికి గర్వకారణంగా నిలిచారని అభినందనలు

(అమరావతి - జయజయహే)

ఏషియన్ గేమ్స్-2026లో స్వర్ణ పతకంతో మెరిసిన ప్రముఖ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ సోమవారం మంత్రి నారా లోకేష్‌ను కలిశారు. జపాన్‌లో జరిగిన ఈ క్రీడల్లో ఆర్చరీ కాంపౌండ్ మహిళల టీమ్ విభాగంలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించిన ఆమె స్వర్ణ పతకం సాధించిన సంగతి తెలిసిందే. తండ్రి సురేంద్రకుమార్‌తో కలిసి ఉండవల్లిలోని లోకేష్ నివాసానికి వెళ్లారు. జ్యోతి సురేఖ సాధించిన విజయాన్ని మంత్రి అభినందించారు. అంతర్జాతీయ వేదికపై భారత జాతీయ పతాకాన్ని రెపరెపలాడిస్తూ దేశానికి, రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారని ప్రశంసించారు. ఏషియన్ గేమ్స్‌లో ఇప్పటివరకు నాలుగు స్వర్ణ పతకాలు సహా మొత్తం ఆరు పతకాలు సాధించిన ఘనత సురేఖకు ఉంది. ఈ భేటీలో 2028 ఒలింపిక్స్ లక్ష్యం కూడా ప్రస్తావనకు వచ్చింది. తదుపరి ఒలింపిక్స్‌లో పతకం సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని లోకేష్ సూచించారు. ఆ లక్ష్యానికి అవసరమైన సహకారం అన్నివిధాలా అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# డెప్యూటేషన్ల మాటున 'ముడుపుల' మాయాజాలం..!

**- క్షేత్ర ఉద్యోగులకు జిల్లా కేంద్రంలో రాజభోగం..**

**- అసలు విధుల్లో ఉన్నవారికి మాత్రం అవస్థలు**

**- కలెక్టర్ జోక్యం చేసుకోవాలన్న ఉద్యోగులు**

**అనకాపల్లి, అక్టోబర్ 5, జయ జయహే:**

అనకాపల్లి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డెప్యూటేషన్ల వ్యవహారం తీవ్ర వివాదానికి దారితీస్తోంది. శాంక్షన్ పోస్టులు లేకపోయినా క్షేత్రస్థాయిలో పనిచేయాల్సిన ఉద్యోగులను జిల్లా కేంద్ర కార్యాలయంలోనే కొనసాగించడం, వారికి కీలకమైన బాధ్యతలు అప్పగించడం వెనుక పెద్ద ఎత్తున అవకతవకలు జరుగుతున్నాయంటూ ఉద్యోగ వర్గాల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీనియార్టీ, అంకితభావం, పనితీరు వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన చోట 'ఎవరికి ఏది నచ్చితే అది' అన్న చందంగా వ్యవహారం సాగుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.




**శాంక్షన్ పోస్టులు లేకున్నా.. జిల్లా కేంద్రంలో కొలువుదీరుతున్నారా?**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయిలో ప్రజలకు వైద్య సేవలు అందించాల్సిన ఉద్యోగులను అవసరానికి మించి కార్యాలయాలకు తరలించకూడదన్న ఉద్దేశం ఉన్నప్పటికీ.. అనకాపల్లి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. మునగపాక, వేములపూడి, తుంపాల, పెనుగొల్లు, అగనంపూడి, తురకలపూడి, కశింకోట, అచ్యుతాపురం తదితర ప్రాంతాల్లో విధులు నిర్వహించాల్సిన కొందరు క్షేత్రస్థాయి ఉద్యోగులు జిల్లా కేంద్ర కార్యాలయంలోనే తిష్టవేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో క్షేత్రస్థాయిలో సిబ్బంది కొరత ఏర్పడుతుండగా.. జిల్లా కార్యాలయంలో మాత్రం ఉద్యోగుల సంఖ్య పెరుగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

**డెప్యూటేషన్.. లేక 'దందా'కు అడ్డా..!**

అసలు డెప్యూటేషన్ ఎందుకు? ఎవరి అవసరం కోసం ఎంతకాలం.. ఏ ఉత్తర్వుల ఆధారంగా... అన్న ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు లేవని ఉద్యోగులు అంటున్నారు. కొందరికి పదేపదే అవకాశం లభిస్తుండగా, మరికొందరు మాత్రం తమకు న్యాయం జరగడం లేదని వాపోతున్నారు. డెప్యూటేషన్ల వెనుక ముడుపుల వ్యవహారం నడుస్తోందన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను బయటపెట్టాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉందని ఉద్యోగ సంఘాలు పేర్కొంటున్నాయి.

**క్షేత్ర ఉద్యోగులతో 'సొంత పనులు' చేయిస్తున్నారా..!**

ఇదే కార్యాలయంలో కొందరు డెప్యూటేషన్‌పై వచ్చిన ఉద్యోగులు తమ కింది స్థాయి సిబ్బందితో అధికారిక విధులకు సంబంధం లేని పనులు చేయిస్తున్నారన్న ఆరోపణలు మరింత కలకలం రేపుతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులను వ్యక్తిగత పనులకు ఉపయోగించుకోవడం నిబంధనలకు విరుద్ధమైతే.. అలాంటి ఘటనలపై ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఫిర్యాదులు వచ్చినా ఎందుకు స్పందించడం లేదు. విధులకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వచ్చినా ఎందుకు వివరణ కోరడం లేదు..డెప్యూటేషన్ ఉత్తర్వులపై సమీక్ష ఎందుకు జరగడం లేదు...అంటూ ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు.

**'చూసీ చూడనట్టు' వ్యవహరిస్తున్నారా..!**

కొంతమంది ఉద్యోగులపై ఫిర్యాదులు ఉన్నప్పటికీ శాఖాధికారులు చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా కార్యాలయ పరిధిలో జరుగుతున్న వ్యవహారాలపై డీఎంఅండ్‌హెచఓ స్థాయి అధికారి స్వయంగా సమీక్షించాల్సి ఉన్నప్పటికీ, ఫిర్యాదులు వచ్చిన సందర్భాల్లో కూడా చర్యలు కనిపించకపోవడం అనుమానాలకు తావిస్తోందని ఉద్యోగ సంఘాలు మండిపడుతున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించిన వాస్తవాలు ఏమిటన్నది స్వతంత్ర విచారణ ద్వారానే తేలాల్సి ఉంది. జిల్లా కలెక్టర్ దృష్టి సారించాలన్న డిమాండ్ క్రమంగా పెరుగుతోంది. డెప్యూటేషన్లపై సమగ్ర విచారణ జరిపి.. ఎవరు ఏ హోదాలో, ఏ ఉత్తర్వులపై, ఎంతకాలంగా జిల్లా కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారో బహిర్గతం చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు. క్షేత్రస్థాయిలో పనిచేయాల్సిన సిబ్బంది జిల్లా కార్యాలయంలోనే కొనసాగుతున్నట్లయితే.. వారి స్థానాల్లో ప్రజలకు సేవలు అందించేది ఎవరు? అన్న అంశంపైనా విచారణ జరగాల్సిన అవసరం ఉందని అంటున్నారు. శాంక్షన్ పోస్టులు లేని చోట డెప్యూటేషన్లు ఎలా కొనసాగుతున్నాయి?

ఒకే వ్యక్తికి పదేపదే ఎందుకు అవకాశం కల్పిస్తున్నారు. డెప్యూటేషన్ వెనుక ఏమైనా ఆర్థిక లావాదేవీలు జరిగాయా

కింది స్థాయి ఉద్యోగులతో వ్యక్తిగత పనులు చేయిస్తున్నారన్న ఆరోపణల్లో వాస్తవమెంత...అన్న ప్రశ్నలకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. ఇది కేవలం ఉద్యోగుల మధ్య అంతర్గత వ్యవహారమా? లేక ప్రభుత్వ వ్యవస్థను ప్రభావితం చేసే స్థాయిలో నడుస్తున్న దందానా అన్నది తేలాలంటే సమగ్ర విచారణే మార్గం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి డెప్యూటేషన్లపై పూర్తి స్థాయి పరిశీలన జరిపి, ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు.

# సీఎం చంద్రబాబు దృష్టికి పంచగ్రామాల సమస్య

## ఎమ్మెల్యే పల్లాను కలిసి విన్నవించిన అడవివరం ప్రజా సేవా సంఘం

**విశాఖపట్నం, అక్టోబర్ 5, జయ జయహే**

అడివివరం ప్రజా సేవా సంఘం అధ్యక్షులు సిరిపురపు వరాహ నరసింహం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటైన కమిటీ సభ్యులు శనివారం గాజువాక నియోజకవర్గ శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుని మర్యాదపూర్వకంగా కలిసి కమిటీ సభ్యులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా పంచగ్రామాల భూ సమస్యలకు సంబంధించిన పలు అంశాలను కమిటీ సభ్యులు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. పంచగ్రామాల భూ సమస్యల పరిష్కారం కోసం న్యాయ-పోరాటానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. రైతులతో పాటు రైతుల నుంచి భూములు కొనుగోలు చేసిన ఖాళీ స్థలాల యజమానులు, ఇళ్ల యజమానుల హక్కులను పరిరక్షించేలా ఈ సమస్యను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేను కోరారు. అలాగే పంచగ్రామాల్లోని మిగిలిన గ్రామకంఠాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అడివివరంలోని మూడు గ్రామకంఠాలను 22 ఏలో చేర్చడం వల్ల గత 30 సంవత్సరాలుగా స్థానిక ప్రజలు తీవ్ర



ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కమిటీ సభ్యులు వివరించారు. ఈ సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి, ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో అడివివరం మాజీ సర్పంచ్ పాశర్ల ప్రసాద్, ప్రధాన కార్యదర్శి పంచదార్ల ప్రసాద్, ఉపాధ్యక్షులు లండ చందు, గ్రామ పెద్దలు లండ సూరిబాబు, జర్రిపోతుల నరసింహమూర్తి, మేక కాసు గోపాల్, పాశర్ల తరుణ్ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

# అధైర్యం వద్దు...కార్యకర్తలతో మేముంటాం...!







**- భీమిలి సమావేశంలో ఎమ్మెల్సీ బొత్స హామీ**

**- భీమిలి సమన్వయకర్తగా తొలిసారి విచ్చేసిన డా. బొత్స అనూషకి ఘన స్వాగతం**

**మధురవాడ, అక్టోబర్ 5, జయ జయహే**

భీమిలి నియోజకవర్గ సమన్వయకర్తగా వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆశీస్సులతో తొలిసారిగా భీమిలి నియోజకవర్గంలోని ఎండాడ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి విచ్చేసిన యువ నాయకురాలు డా. బొత్స అనూష కి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. జిల్లా పార్టీ అధ్యక్షులు కేకే రాజు అధ్యక్షతన ఎండాడ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ ఆత్మీయ కలయిక కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాసనమండలి విపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రులు కురసాల కన్నబాబు, ముత్యాల నాయుడు , గుడివాడ అమర్‌నాథ్ , పాముల పుష్ప శ్రీవాణి , మాజీ పార్లమెంట్ సభ్యురాలు డా. బొత్స ఝాన్సీ లక్ష్మి , యువ నాయకులు డాక్టర్ బొత్స సందీప్ పాల్గొని పార్టీలో జోష్ నింపారు. ఈ సందర్భంగా బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ భీమిలి నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచిన ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త మన కుటుంబ సభ్యుడేనని అన్నారు. కష్టం వచ్చినప్పుడు కార్యకర్తలకు అండగా నిలబడటమే మన బాధ్యత అని తెలిపారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా అధైర్యపడాల్సిన అవసరం లేదని, నాయకులు, కార్యకర్తల వెంటే తామంతా ఉంటామని భరోసా కల్పిస్తూనే భీమిలి నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు సమష్టిగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.మరల వైయస్ జగన్మోహన్ రెడ్డి ని ముఖ్యమంత్రిగా చేసుకునే విధంగా మనందరం కలిసికట్టుగా కష్టపడదాం తెలిపారు. నాయకులు వస్తుంటారు పోతుంటారు కానీ పార్టీ శాశ్వతం, అదే విధంగా ఐడి కార్డులు పొందిన ప్రతి ఒక్కరికీ కూడా పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గౌరవం ఉంటుంది ఎవరు కూడా అధైర్య పడవద్దు మనందరి మాట ఒకటే మాట జగన్మోహన్ రెడ్డి మాట అదే విధంగా వైయస్ జగన్మోహన్ రెడ్డి గారినీ



ముఖ్యమంత్రి చేయడమే మన లక్ష్యమని భీమిలి నియోజకవర్గం శాసనసభ్యులుగా అనుషని చేయాలని తెలిపారు. డా. బొత్స ఝాన్సీ లక్ష్మి మాట్లాడుతూ కష్టకాలంలో కార్యకర్తలను ఒంటరిగా వదిలే ప్రసక్తే లేదని, ఏ సమస్య వచ్చినా, ఏ ఇబ్బంది ఎదురైనా తోడుగా ఉంటామని భరోసా ఇచ్చారు. భీమిలి నియోజకవర్గం సమన్వయ కర్త డా. బొత్స అనూష మాట్లాడుతూ ఇకపై నాయకురాలిగా మాత్రమే కాకుండా కుటుంబంలో ఒక సభ్యురాలిగా అందరితో కలిసి నడుస్తానని తెలిపారు. ఎవరికైనా ఏ సమస్యతో వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని,మా నాన్న బొత్స సత్యనారాయణ సూచనలతో ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు వరుదు కళ్యాణి, కుంభ రవిబాబు, వివిధ జిల్లాల పార్టీ అధ్యక్షులు బెల్లాన చంద్రశేఖర్ , పరీక్షిత్ రాజు, బొడ్డేటి ప్రసాద్ , మాజీ శాసన సభ్యులు, నియోజకవర్గాల సమన్వయకర్తలు బొత్స అప్పల నరసయ్య , ధర్మ శ్రీ ,కంబాల జోగులు ,అదీప్ రాజు ,వెంకటరమణ , తిప్పల గురుమూర్తి రెడ్డి, తిప్పల దేవాన్ష్ రెడ్డి , అప్పారావు , తైనాల విజయ్ కుమార్ ,మహిళా అధ్యక్షులు పేడాడ రమణ కుమారి , హైమవతి,మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ జల్లిపల్లి సుభద్ర , మాజీ మేయర్ హరి వెంకట కుమారి, ఉత్తరాంధ్ర జిల్లాల నియోజకవర్గాల పరిశీలకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు




# కొత్తగా నాలుగు పోలీసు కమిషనరేట్లు

## తిరుపతి, కర్నూలు, గుంటూరు, రాజమహేంద్రవరం ఏర్పాటు

**ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం**

**(అమరావతి - జయజయహే)**

రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. తిరుపతి, కర్నూలు, రాజమహేంద్రవరం, గుంటూరు పోలీస్ కమిషనరేట్ ఏర్పాటుకు అనుమతి ఇస్తూ ప్రభుత్వం జీవోలు జారీచేసింది. ఐజీపీ లేదా డీఐజీ హోదా కలిగిన అధికారి తిరుపతి పోలీస్ కమిషనర్‌గా వ్యవహరిస్తారని తెలిపింది. కొత్తగా ఏర్పడే తిరుపతి సీపీకి బిఎన్ఎస్ఎస్ , 2023 సెక్షన్ 14(6) కింద ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ అధికారాలు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తిరుపతి పోలీస్ కమిషనరేట్‌లో తిరుమల, తిరుపతి, శ్రీకాళహస్తి, శ్రీసిటీ అనే 4 టెరిటోరియల్ జోన్లను ఏర్పాటు చేసింది. పెరుగుతున్న భక్తుల రద్దీ, ట్రాఫిక్, క్రైమ్, వీఐపీ భద్రత, శాంతిభద్రతల సమర్థ నిర్వహణ కోసం ఈ కమిషనరేట్ ఏర్పాటు చేసినట్లు ఏపీ సర్కార్ స్పష్టం చేసింది. విజయవాడ సిటీ క్రైమ్స్ జాయింట్ సీపీ పోస్టును తిరుపతి పోలీస్ కమిషనర్ పోస్టుగా మారుస్తు ఉత్తర్వులు జారీ చేసింది. మెరైన్ వింగ్ ఎస్పీ పోస్టును డీసీపీ (తిరుమల)గా, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ పోస్టును డీసీపీ (శ్రీకాళహస్తి)గా మార్పు చేసింది. విజయవాడ ట్రాఫిక్ డీసీపీ పోస్టును డీసీపీ (తిరుపతి)గా, గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్ పోస్టును డీసీపీ (శ్రీసిటీ)గా మార్చింది. ఏపీఎస్పీ బెటాలియన్ సీఎంటీ-1 పోస్టును డీసీపీ (కోఆర్డినేషన్)గా కేటాయించింది. జిల్లాలో ఉన్న 4 అదనపు ఎస్పీ పోస్టులను అదనపు డీసీపీలుగా, 12 డీఎస్పీ పోస్టులను ఏసీపీ (రూజూ)లుగా పునర్ని నియామకం చేపట్టింది. తిరుపతి కమిషనరేట్ ఏర్పాటు కోసం ఎలాంటి కొత్త పోస్టులను సృష్టించడం లేదని ఏపీ సర్కార్ ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. అలాగే, రాజమహేంద్రవరం పోలీసు కమిషనరేట్‌కి ఐజీపీ, డీఐజీపీ స్థాయి అధికారి సారథ్యం వహిస్తారని ఏపీ సర్కార్ పేర్కొంది. నలుగురు డీసీపీలు, నలుగురు ఆదనపు డీసీపీలు, ఐదుగురు ఏసీపీలను కేటాయించింది. గుంటూరు పోలీసు కమిషనరేట్‌కి ఐజీపీ లేదా డీఐజీపీ స్థాయి అధికారి సారథ్యం వహిస్తారని వెల్లడించింది. డీసీపీలు ఐదుగురు, ఆదనపు డీసీపీలు నలుగురు, ఆరుగురు ఏసీపీలను ఏపీ సర్కార్ కేటాయించింది.



## ఫోర్జరీ కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

**అనకాపల్లి జయ జయహే**

అనకాపల్లి కసింకోట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక స్థల వివాదానికి సంబంధించి కోర్టు నుండి అందిన ఎండార్స్మెంట్ పిటిషన్ పై కసింకోట పోలీసుల సమగ్రంగా దర్యాప్తు చేపట్టడం జరిగింది దర్యాప్తులో భాగంగా జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు కసింకోట తాసిల్దార్ కార్యాలయ అధికారులు కసింకోట పంచాయతీ కార్యాలయ సిబ్బంది మరియు ఇతర ముఖ్య సాక్షులను క్షుణ్ణంగా విచారించి పత్రాలను పరిశీలించి నకిలీ ఫోర్జరీ పత్రాలను ఉపయోగించి బాధ్యతల్ని ప్రభుత్వ సంస్థలను మోసం చేసినట్లు ప్రాథమికంగా పోలీసులు విచారణలో నిర్ధారించడం జరిగింది ఆ ఆధారాల మేరకు ఇద్దరు ప్రధాన నిందితులను పోలీసులు అరెస్ట్ చేయడం జరిగింది అరెస్టు చేసిన నిందితులను కోర్టులో హాజరుపరచగా గౌరవ న్యాయమూర్తి కేసు సంబంధించి పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి ఇద్దరు నిందితులను 12 రోజులు జ్యుడీషియల్ రిమాండ్ విధించడం జరిగింది పెంటకోట నాయుడు( ప్రకాష్ ) పెంటకోట సత్యనారాయణ( సత్తిబాబు) వీరు ఇద్దరు కసింకోట గ్రామంకి చెందిన వారిగా పోలీసులు పేర్కొన్నారు మోసం ఫోర్జరీ పత్రాలను ఉపయోగించడం ద్వారా ప్రభుత్వ సంస్థలు మోసం చేయడం వంటి ఆర్థిక నేరాలకు పాల్పడినవారు ఎంతటి వారైనా చట్ట ప్రకారం చర్యలు తప్పవని పోలీసులు పేర్కొన్నారు కసింకోట సిఐ అల్లు స్వామి నాయుడు పర్యవేక్షణ లో ఎస్సై కే లక్ష్మణరావు ఈ దర్యాప్తును నిర్వహించారు

## గుంటూరులో ట్రాఫిక్ క్రమబద్ధీకరిస్తా..!

**నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీఎస్పీ ఎస్. కాంతారావు**

**విశాఖపట్నం, అక్టోబర్ 5, జయ జయహే**



గుంటూరు ట్రాఫిక్ డీఎస్పీగా ఎస్. కాంతారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మర్యాదపూర్వకంగా గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌ని కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరు నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేకంగా కృషి చేస్తానన్నారు. ట్రాఫిక్ సమస్యలు ఉన్న ప్రాంతాలను ప్రజలు తమ దృష్టికి తీసుకువస్తే, వాటిని జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లి, మున్సిపల్ కమిషనర్ సంబంధిత శాఖల అధికారుల సహకారంతో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ట్రాఫిక్ వ్యవస్థ అందించేందుకు సమన్వయంతో పనిచేస్తామని ఆయన పేర్కొన్నారు. నూతన డీఎస్పీ ఎస్. కాంతారావు 1995లో ఎసఐగా పోలీస్ శాఖలో ఎంపికై, విశాఖ జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహించారు. 2010లో ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొంది, విశాఖపట్నం ఉమ్మడి జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వర్తించారు. తాజాగా 2026లో డీఎస్పీగా పదోన్నతి పొంది గుంటూరు ట్రాఫిక్ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నలుమలల నుంచీ ఆయన అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు.



## ఇదేం కోతి బాబోయ్..!

### వీధుల్లో వీరంగం.. కనిపిస్తే చాలు దాడి.. సుమారు 20 మందికి గాయాలు!

### విశాఖలో కోతి బీభత్సం.. హనుమంతువాక నుంచి కాలనీల వరకు హడల్

**విశాఖపట్నం, అక్టోబర్ 5, జయ జయహే**

కోతి కనిపిస్తే సరదాగా చూస్తాం.. అది చేసే అల్లరిని చూసి నవ్వుకుంటాం.. కానీ అదే కోతి మీదకు దూసుకొచ్చి దాడి చేస్తే..! ఆ ఊహే భయంకరం. విశాఖలోని పలు కాలనీల్లో ప్రస్తుతం ఇదే పరిస్థితి నెలకొంది. ఓ కోతి ఒక్కసారిగా రెచ్చిపోయి స్థానికులపై దాడులకు దిగడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

హనుమంతువాక, దుర్గా కాలనీ, క్రాంతి నగర్, విజయదుర్గ కాలనీ తదితర ప్రాంతాల్లో సోమవారం ఓ కోతి హల్‌చల్ చేసినట్లు సమాచారం. కనిపించిన వారిపైకి దూసుకొస్తూ కరిచినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ ఘటనల్లో సుమారు 20 మంది గాయపడినట్లు సమాచారం. కోతి దాడులతో పలువురు గాయపడటంతో ఆయా ప్రాంతాల ప్రజల్లో ఆందోళన నెలకొంది.

**వీధిలోకి రావాలంటేనే భయం!**

సాధారణంగా కోతులు ఆహారం కోసం ఇళ్ల పరిసరాల్లోకి రావడం చూస్తుంటాం. అయితే, ఈ కోతి మాత్రం దూకుడుగా వ్యవహరిస్తూ ఎదురుపడిన వారిపై దాడికి దిగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు, ఎవరిపై దాడి చేస్తుందో తెలియని పరిస్థితి నెలకొనడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సి వస్తోంది. ముఖ్యంగా రహదారులపై తిరిగేవారు, ఇళ్ల నుంచి బయటకు వచ్చేవారు భయాందోళనకు గురవుతున్నారు.

**అధికారులు స్పందించేదెప్పుడు?**

ఒకటి కాదు.. రెండు కాదు.. సుమారు 20 మంది గాయపడినట్లు సమాచారం వెలువడటంతో స్థానికులు ఈ సమస్యపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోతి దాడుల వల్ల మరింతమంది గాయపడక ముందే అటవీ శాఖ అధికారులు స్పందించాలని కోరుతున్నారు. ప్రజలకు ప్రమాదకరంగా మారిన కోతిని గుర్తించి, సురక్షితంగా పట్టుకుని తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**మరో ఘటన జరిగితేనే కదులుతారా?**

ప్రజల ప్రాణభద్రతకు ముప్పుగా మారుతున్న ఈ సమస్యపై అధికారులు తక్షణమే దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. కోతి దాడుల్లో గాయపడిన వారికి అవసరమైన వైద్యసహాయం అందేలా చూడటంతో పాటు, కోతిని అదుపులోకి తీసుకునేందుకు తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కోతి బీభత్సానికి ఎప్పుడు అడ్డుకట్ట పడుతుంది? అధికారులు ఎప్పుడు స్పందిస్తారు. అన్నది ఇప్పుడు స్థానికులను వేధిస్తున్న ప్రశ్న. మరోసారి ఎవరికైనా ప్రమాదం జరగకముందే సంబంధిత అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

## ఆసియా క్రీడల్లో భారత విజయగాథ నుంచి

# భవిష్యత్ శిఖరాల దాకా

**(హెచ్.ప్రతాప్)**

జపాన్‌లో ముగిసిన 2026 ఆసియా క్రీడలు భారత క్రీడా చరిత్రలో మరో గర్వకారణంగా నిలిచాయి. భారత్ 21 స్వర్ణాలు, 27 రజతాలు, 37 కాంస్యాలతో కలిపి మొత్తం 85 పతకాలు సాధించి పతకాల పట్టికలో నాలుగో స్థానంలో నిలవడం దేశ క్రీడా సామర్థ్యాన్ని మరోసారి ప్రపంచానికి చాటిచెప్పింది. ఇది కేవలం సంఖ్యల విజయమే కాదు. భారత క్రీడా వ్యవస్థలో గత దశాబ్దంగా జరుగుతున్న ప్రణాళికాబద్ధమైన మార్పులకు లభించిన ఫలితం.

హాంగ్‌జౌలో జరిగిన 2022 ఆసియా క్రీడల్లో భారత్ చరిత్రాత్మకంగా 107 పతకాలు సాధించింది. ఆ ప్రదర్శనతో పోలిస్తే ఈసారి మొత్తం పతకాల సంఖ్య తగ్గినప్పటికీ, భారత క్రీడా రంగం వెనక్కి వెళ్లిందనే భావన సరైంది కాదు. ఒక తరం నుంచి మరో తరానికి మార్పు జరుగుతున్న సందర్భంలోనూ భారత్ తన పోటీ సామర్థ్యాన్ని నిలుపుకుంది. అథ్లెటిక్స్, హాకీ, రెజ్లింగ్, ఆర్చరీ, క్రికెట్ వంటి విభాగాల్లో భారత క్రీడాకారులు అసాధారణ పోరాటస్ఫూర్తిని ప్రదర్శించారు. ముఖ్యంగా ఒత్తిడి పరిస్థితుల్లోనూ పతకాలను సాధించడం భారత క్రీడాకారుల మానసిక దృఢత్వానికి నిదర్శనం.



భారత విజయాల వెనుక కనిపించని అనేక చేతులు ఉన్నాయి. కుటుంబాల త్యాగాలు, కోచ్‌ల కృషి, క్రీడా శాస్త్రవేత్తల మార్గదర్శకత్వం, ప్రభుత్వ పథకాలు, కార్పొరేట్ రంగ మద్దతు కలిసి ఈ విజయానికి బలమైన పునాది వేశాయి. ఒకప్పుడు క్రీడలను కొద్ది నగరాలకే పరిమితమైన రంగంగా భావించేవారు. నేడు గ్రామీణ ప్రాంతాల నుంచి, సాధారణ కుటుంబాల నుంచి వచ్చిన యువకులు ఆసియా వేదికపై జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్నారు. ఇదే నిజమైన భారత క్రీడా విప్లవం.

అయితే విజయాన్ని సంబరంగా మాత్రమే చూడకుండా, దాన్ని మరింత ఉన్నత లక్ష్యాలకు పునాదిగా మలచుకోవాలి. చైనా, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలు క్రీడలను విద్యా వ్యవస్థతో అనుసంధానించి దశాబ్దాలుగా ప్రతిభను తయారు చేస్తున్నాయి. భారత్ కూడా ప్రతి జిల్లాలో అత్యాధునిక క్రీడా అకాడమీలు ఏర్పాటు చేయాలి. పాఠశాల స్థాయిలో క్రీడా గుర్తింపు కార్యక్రమాలను విస్తరించాలి. క్రీడా శాస్త్రం, పోషకాహారం, స్పోర్ట్స్ మెడిసిన్, డేటా అనలిటిక్స్, మానసిక శిక్షణ వంటి అంశాలను మరింత బలోపేతం చేయాలి. మహిళా క్రీడాకారులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు, గ్రామీణ ప్రాంతాలకు నాణ్యమైన మౌలిక సదుపాయాలు, ప్రతిభావంతులకు నిరంతర ఆర్థిక భరోసా కల్పించాల్సిన అవసరం ఉంది.



2030 ఆసియా క్రీడల నాటికి భారత్ లక్ష్యం కేవలం వంద పతకాలు సాధించడం కాకూడదు. పతకాల పట్టికలో తొలి మూడు స్థానాల్లో చోటు సంపాదించడం కావాలి. ఇందుకు కనీసం 35 నుంచి 40 స్వర్ణ పతకాలను లక్ష్యంగా నిర్దేశించుకోవాలి. ప్రతిభకు అవకాశాలు, అవకాశాలకు సరైన వనరులు, వనరులకు దూరదృష్టి కలిస్తే ఈ లక్ష్యం అసాధ్యం కాదు.



జపాన్ ఆసియా క్రీడలు మనకు ఒక గొప్ప పాఠాన్ని నేర్పాయి. విజయాలు యాదృచ్ఛికంగా రావు. అవి క్రమశిక్షణ, కఠోర శ్రమ, దీర్ఘకాలిక ప్రణాళికల ఫలితం. భారత యువతలో అపార ప్రతిభ ఉంది. ఆ ప్రతిభకు సరైన దిశ, నిరంతర మద్దతు అందితే రాబోయే ఆసియా క్రీడల్లో భారత త్రివర్ణ పతాకం మరింత ఎత్తున రెపరెపలాడటం ఖాయం. భారతదేశం ఇక పాల్గొనే దేశం మాత్రమే కాదు. ఆసియా క్రీడల భవిష్యత్తును ప్రభావితం చేసే క్రీడా మహాశక్తిగా అవతరించే సామర్థ్యం కలిగిన దేశం.

# స్టాక్ మార్కెట్ జోరు..

### ద్రవ్య విధానంపై ఎదురుచూపు.. ఆర్థిక వ్యవస్థకు పరీక్షా సమయం

### మార్కెట్లలో జోష్.. సెన్సెక్స్ 400 పాయింట్లకు పైగా జంప్

**(ప్రతాప్)**



భారతీయ ఈక్విటీ మార్కెట్లు సోమవారం బలమైన ర్యాలీతో ప్రారంభమయ్యాయి. బీఎస్ఈ సెన్సెక్స్ ప్రారంభ ట్రేడింగ్‌లో 431 పాయింట్లు ఎగబాకి 72,340 స్థాయిని తాకగా, నిఫ్టీ 110 పాయింట్లు పెరిగి 22,532 వద్ద ప్రారంభమైంది. గత ట్రేడింగ్ సెషన్‌లో సెన్సెక్స్ 71,909 వద్ద, నిఫ్టీ 22,421 వద్ద ముగిసిన నేపథ్యంలో ఈ పెరుగుదల పెట్టుబడిదారులకు ఉపశమనాన్ని కలిగించింది. అమెరికా ఉద్యోగ గణాంకాలు అంచనాలకు దిగువన నమోదవడంతో ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల పెంపుపై ఉన్న ఆందోళనలు తగ్గాయి. దీంతో ఆసియా మార్కెట్లలోనూ సానుకూల ధోరణి కనిపించింది. ఇన్ఫోసిస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టీసీఎస్, ఎల్ అండ్ టీ వంటి షేర్లు ప్రధాన లాభదాయకులుగా నిలిచాయి. ఎన్ఎస్ఈలో 2,043 షేర్లు లాభాల్లో, 1,041 షేర్లు నష్టాల్లో ముగియడం మార్కెట్ వెడల్పును సూచిస్తోంది. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు రూ.9,484 కోట్ల విలువైన షేర్లను విక్రయించగా, దేశీయ సంస్థాగత పెట్టుబడిదారులు రూ.10,042 కోట్ల కొనుగోళ్లతో మద్దతు ఇచ్చారు.

**ఆర్‌బీఐ ద్రవ్య విధానంపై ఉత్కంఠ.. రెపో రేటు పెంపుపై అంచనాలు**

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశం నేటి నుంచి ప్రారంభమైంది. అక్టోబర్ 7న వెలువడనున్న నిర్ణయంపై బ్యాంకింగ్, పరిశ్రమలు, పెట్టుబడి వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. ప్రస్తుతం రెపో రేటు 5.25 శాతంగా ఉండగా, దానిని 25 బేసిస్ పాయింట్లు పెంచి 5.50 శాతానికి తీసుకెళ్లే అవకాశముందనే అంచనాలు మార్కెట్లో బలంగా వినిపిస్తున్నాయి. ఆగస్టులో రిటైల్ ద్రవ్యోల్బణం 4.82 శాతానికి పెరగడం, ముడి చమురు ధరల ప్రభావం, రూపాయి బలహీనత వంటి అంశాలు ఆర్‌బీఐపై ఒత్తిడి పెంచుతున్నాయి. రాయిటర్స్ సర్వేలో పాల్గొన్న ఆర్థికవేత్తల్లో దాదాపు 60 శాతం మంది వడ్డీరేటు పెంపు జరిగే అవకాశాన్ని వ్యక్తం చేశారు. రెపో రేటు పెరిగితే రుణాలపై వడ్డీ భారాలు పెరిగే అవకాశం ఉన్నప్పటికీ, ద్రవ్యోల్బణ నియంత్రణకు దోహదపడుతుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

**బిజినెస్ NEWS**

**ముడి చమురు, రూపాయి, కార్పొరేట్ ఫలితాలపై మార్కెట్ దృష్టి**

ముడి చమురు ధరలు, రూపాయి మారకం విలువ, రెండో త్రైమాసిక ఫలితాల సీజన్ ప్రస్తుతం భారత ఆర్థిక రంగంలో ప్రధాన చర్చాంశాలుగా మారాయి. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 102 డాలర్ల సమీపంలో కొనసాగుతుండగా, అమెరికా బాండ్ యీల్డు రెండు దశాబ్దాల గరిష్ఠ స్థాయిల వద్ద ఉన్నాయి. ఈ ప్రభావంతో రూపాయి డాలర్‌తో పోలిస్తే 96.31 వద్ద రెండు నెలల కనిష్ఠ స్థాయికి చేరింది. చమురు ధరల పెరుగుదల భారత దిగుమతి వ్యయాన్ని పెంచడంతో పాటు ద్రవ్యోల్బణ ఒత్తిడిని కూడా అధికం చేసే ప్రమాదం ఉంది. ఇదే సమయంలో సెప్టెంబరు త్రైమాసిక ఫలితాల సీజన్ ప్రారంభం కానుండగా, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) తొలి సంస్థగా ఫలితాలు ప్రకటించనుంది. ఆర్‌బీఐ విధాన నిర్ణయం, చమురు ధరల కదలికలు, కార్పొరేట్ లాభదాయకతపై వచ్చే గణాంకాలే రాబోయే వారాల్లో భారత మార్కెట్ల దిశను నిర్ణయించనున్న కీలక అంశాలుగా విశ్లేషకులు పేర్కొంటున్నారు.



## ప్రాణం పోతుందనుకున్న వేళ.. వైద్యులే దేవుళ్లయ్యారు!

### అత్యవసర చికిత్సతో పశువుకు పునర్జీవం.. రైతు కుటుంబంలో ఆనందం

**ముంచంగిపుట్టు, జయ జయహే :**

అర్ధరాత్రి వేళ ఆపదలో ఉన్న మూగజీవికి అండగా నిలిచారు పశువైద్యులు. అత్యవసర సమయంలో వెంటనే స్పందించి సమయస్ఫూర్తితో చికిత్స అందించి పశువును కాపాడారు. ఈ ఘటన ముంచంగిపుట్టు మండలం లబ్బూరు గ్రామంలో చోటుచేసుకుంది.అక్టోబర్ 4వ తేదీ రాత్రి 9 నుంచి 10 గంటల మధ్య తీవ్ర అనారోగ్యంతో పశువును బాధపడుతుంది అన్న విషయాన్ని పశువైద్య సిబ్బందికి సంబంధిత రైతు తెలియజేశారు. పశు వైద్య సిబ్బంది ఆ విషయాన్ని వెటర్నరీ డా. జ్యోతి స్వరూప, డా. ప్రదీప్ కుమార్ లావేటి లకు సమాచారం అందించారు,. వెంటనే వారు రాత్రి అయినప్పటికీ పసుపు చికిత్స అందించేందుకు ఆ గ్రామానికి చేరుకొని చికిత్స ప్రారంభించారు. పశువుకు తీవ్రమైన సర్వికల్ ప్రోలాప్స్( గర్భాశయ ముఖ ద్వారం క్రిందికి జారడం ) సమస్య ఉన్నట్లు గుర్తించిన వైద్యులు అత్యవసర వైద్య చర్యలు చేపట్టారు.పశువుకు అవసరమైన మత్తు, నొప్పి నివారణ చర్యలు చేపట్టి, బయటకు వచ్చిన భాగంలో ఏర్పడిన వాపును తగ్గించేందుకు చక్కెర, టచ్-మీ-నాట్ ఆకులను ఉపయోగించారు. అనంతరం ఎంతో జాగ్రత్తగా చికిత్స చేసి, బయటకు వచ్చిన భాగాన్ని తిరిగి లోపలికి అమర్చడంలో వైద్యులు విజయవంతమయ్యారు.చికిత్స అనంతరం పశువు సాధారణ స్థితికి చేరుకోవడంతో రైతు కుటుంబం ఊపిరి పీల్చుకుంది. ప్రస్తుతం పశువు ఆరోగ్యంగా, సురక్షితంగా ఉందని, తదుపరి సంరక్షణను కూడా అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు.

**మూగజీవి ప్రాణం కోసం.. వైద్యుల సమయస్ఫూర్తి, సేవాభావం**

అత్యవసర సమయంలో వెంటనే స్పందించి పశువుకు చికిత్స అందించిన పశు వైద్యులకు రైతు కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది. తమ పశువు సురక్షితంగా బయటపడటంతో కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది. ఈ చికిత్సను డా. జ్యోతి స్వరూప, డా. ప్రదీప్ కుమార్ లావేటి నిర్వహించగా, సిబ్బంది వరలక్ష్మి, అనిల్, రమేష్ అవసరమైన సహకారం అందించారు.

# టిల్ ప్రమాద మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల పరిహారం

## 24 గంటల్లోనే నష్టపరిహారం.. బాధితులకు చెక్కులు అందజేత







**శ్రీసిటీ, అక్టోబర్ 5, జయ జయహే**

శ్రీసిటీలోని టిల్ హెల్త్‌కేర్ పరిశ్రమలో అక్టోబర్ 3న జరిగిన ప్రమాదంలో మృతి చెందిన ఐదుగురు కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచింది. ఒక్కో కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించగా, 24 గంటల్లోనే పరిహారం మంజూరు చేసినట్లు జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. ప్రమాదంలో ఐదుగురు కార్మికులు మృతి చెందినట్లు వార్తా నివేదికలు ధ్రువీకరిస్తున్నాయి. సోమవారం శ్రీసిటీ బిజినెస్ సెంటర్‌లో బాధిత కుటుంబాలను పరామర్శించిన కలెక్టర్ పరిహారం చెక్కులను అందజేశారు. ప్రమాద బీమా పరిహారంతో పాటు అర్హులైన కుటుంబ సభ్యులకు విద్య, ఉపాధి, ఉ ద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా శ్రీసిటీతో పాటు జిల్లాలోని పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు కూడా బాధిత కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ప్రభుత్వం త్వరితగతిన పరిహారం అందించి తమ కుటుంబాలకు భరోసా కల్పించినందుకు మృతుల కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు.



# ఓటు సవరణే..
# ఓట్ల తొలగింపు కాదు!

**బిజెపి ఎమ్మెల్సీ సోము వీర్రాజు**

**రాజమహేంద్రవరం: జయ జయహే: అక్టోబర్ 6**

ఎస్ఐఆర్ అంటే ఓట్లను తొలగించడం కాదని, ఓటర్ల జాబితాలో అవసరమైన సవరణలు చేయడమేనని బిజెపి ఎమ్మెల్సీ సోము వీర్రాజు స్పష్టం చేశారు. ఫారం నంబర్--6లో ఒక్క పదం కూడా మార్చలేదని, ఓటర్ల సౌలభ్యం కోసం మాత్రమే కొన్ని మార్పులు చేశారని తెలిపారు. రాజమహేంద్రవరంలో సోము వీర్రాజు మాట్లాడుతూ.. ఎస్ఐఆర్‌పై ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయం ఏకగ్రీవ నిర్ణయం కాదని, ఎన్నికల కమిషనర్, డైరెక్టర్లు కలిసి తీసుకున్న నిర్ణయమని అన్నారు. దీనిని సుప్రీంకోర్టు కూడా ఆమోదించిందని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ సభ్యుల మధ్య చర్చలు, భిన్నాభిప్రాయాలు ఉండొచ్చని, అయితే విభేదాలు లేవని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా రూపకల్పన నాలుగు గోడల మధ్య జరిగే ప్రక్రియ కాదని, రాజకీయ పార్టీల బూత్ లెవెల్ ఏజెంట్ల భాగస్వామ్యంతో జరుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లను కూడా నియమించుకోలేదని విమర్శించారు. 'ఓటు చోరీ' అనే పదాన్ని కాంగ్రెస్ పార్టీ ఒక టూల్‌కిట్‌లా ఉపయోగించుకుంటోందని ఆరోపించారు. జెన్‌జి ఉద్యమాలపై మాట్లాడుతూ.. మోదీ, చంద్రబాబే అసలైన జెన్‌జికి ప్రతినిధులని అన్నారు. జెన్‌జి ఉద్యమాలకు విదేశాల నుంచి నిధులు వస్తున్నాయన్న ఆరోపణలు చేశారు. మోదీని విమర్శించేందుకు అభిజిత్ దీప్కే ఎవరు అని ప్రశ్నించారు. మద్యం ధరలఅంశాన్నిప్రస్తావిస్తూ.. తాను మద్యం ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తే తనను 'సారాయి వీర్రాజు' అని విమర్శించారని గుర్తుచేశారు. నకిలీ మద్యం ద్వారా వైసిపి నేతలు వేల కోట్ల రూపాయలు కూడబెట్టారని ఆరోపించారు. తమకు పార్టీ ఓట్ల కంటే భారతదేశ అభివృద్ధే ముఖ్యమని అన్నారు. దేశంలో రాహుల్ గాంధీని ప్రజలు పక్కన పెడుతున్నారని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలోబిజెపి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, రాష్ట్ర కార్యదర్శి బొమ్మల దత్తు, పాల్గొన్నారు



### ఘనంగా జక్కంపూడి రాజా
# జన్మదిన వేడుకలు

**రాజమహేంద్రవరం : జయ జయహే :**

అక్టోబర్ 5:బొమ్మూరులోని వైసిపి జిల్లా పార్టీ కార్యాలయంలో రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా పార్టీ అధ్యక్షులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని రాజాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. పార్టీ నాయకులు రాజా సేవలను, యువతను పార్టీ వైపు సమీకరించడంలో ఆయన నిర్వహిస్తున్న పాత్రను ప్రస్తావిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు గోందేశీ శ్రీనివాసరెడ్డి, నక్కా రాజబాబు, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి అంగాడ సత్యప్రియ, మహిళా అధికార ప్రతినిధి రుఖియా సయ్యద్, రాష్ట్ర మైనారిటీ సెల్ అధికార ప్రతినిధి డాక్టర్ అలీ, డబ్బింగ్ రామేష్, ముద్దాల అను, కొప్పినీడి రాజమౌళి, చెరుకూరి సత్యనారాయణ, చాప రాజా, ఓడూరి రాంకీ, కల్లూరి చైతు, రీసు సతీష్, దొడ్డి సతీష్, ఆకుల సుధాకర్, షటర్ బాషా, హమీద్ బాషా, ఇబ్రహీం బాషా, పల్లెటి చిన్న, చిచ్చార చంటి, కడియాల గోవింద్, సోమన శ్రీను, కోటిపల్లి రవీంద్ర, షేక్ మౌలాలి, శివ, పవన్ తదితరులు పాల్గొన్నారు.



### సెగ్మెంట్ల వారీగా
# అవగాహన సదస్సు

**కూటమి బలోపేతానికి పిలుపు..**

**కొయ్యూరు : (జయ జయహే న్యూస్) అక్టోబర్ 6,**

కొయ్యూరు మండలం సరభన్నపాలెం సెగ్మెంట్ పరిధిలో ఎర్రకొండమ్మ తల్లి ఆలయంలో టీడీపీ-బీజేపీ-జనసేన కూటమి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి తోట దొరబాబు, కో-ఆపరేటివ్ చైర్మన్ సుమర్ల సాంబశివ మాట్లాడుతూ రాబోయే స్థానిక ఎన్నికల్లో కూటమి తరపున ఎవరిని అభ్యర్థిగా నిలబెట్టినా కష్టపడి గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. నియోజకవర్గ స్థాయిలో కూటమి నాయకులతో సమావేశం ఏర్పాటు చేశామని, త్వరలో కొయ్యూరు మండలంలో మూడు పార్టీల కూటమి నాయకులతో మండల స్థాయి సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఇన్చార్జి గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో జరిగే మండల స్థాయి సమావేశంలో పంచాయతీల్లో, సెగ్మెంట్లలో పోటీ చేయాలనుకునే ఆశావహులు ప్రతి ఒక్కరూ దరఖాస్తు పెట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షురాలు గాన రమాదేవి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు గర్రెంగి రాజేశ్వరి, కే. వరలక్ష్మి, పనశల ఇందిరా, వెలగలపాలెం సర్పంచ్ సత్యనారాయణ, మాజీ సర్పంచ్ దారకొండ నారాయణమూర్తి, జంప వెంకటరమణ, యూనిట్ ఇంచార్జులు గాలి చిన్నారావు, లోతా సింహాచలం, సుంకరి బాలకృష్ణ, బంటు లక్ష్మయ్య, దేవత, క్రాంతి, నాలుగు పంచాయతీల నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.




### 20 ఫిర్యాదులు.. తక్షణ
# పరిష్కారానికి ఆదేశాలు

**అడిషనల్ ఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్**

**రాజమహేంద్రవరం: జయ జయహే:అక్టోబర్ 6:**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పి.జి.ఆర్.ఎస్ కార్యక్రమాన్ని సోమవారం తూర్పుగోదావరి జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించారు. అదనపు ఎస్పీ (అడ్మిన్) పాటిల్ దేవరాజ్ మనప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలనుస్వయంగాతెలుసుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చినఫిర్యాదుదారులతో మాట్లాడిన అదనపు ఎస్పీ.. సమస్యల వివరాలను తెలుసుకుని, సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఫిర్యాదులను చట్ట పరిధిలో పరిశీలించి, సత్వర పరిష్కారం చూపి బాధితులకు న్యాయం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నేటి పి.జి ఆర్.ఎస్ కార్యక్రమంలో మొత్తం 20 ఫిర్యాదులు అందాయి. వీటిలో సివిల్ వివాదాలు, కుటుంబ సమస్యలు, చీటింగ్ కేసులు, ఇతర సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుల సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకుని, ప్రతి ఫిర్యాదును చట్ట ప్రకారం పరిష్కరించేలా సంబంధిత అధికారులకు అదనపు ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు.



# బిఎస్ఎన్ఎల్ సిగ్నల్ సదుపాయం వెంటనే అందించాలి

**అరకులోయ: అక్టోబర్05. జయ జయహే.**

అరకు వేలి బిఎస్ఎన్ఎల్ సబ్ డివిజన్ ఇంజనీరింగ్ అధికారి విజయ నందన్ కి వినతిపత్రం ఇచ్చిన గసబ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ సిపిఎం పార్టీ మండల నాయకులు పాంగి సురేష్ కుమార్, సిగ్నల్ అందకపోవడానికి గల కారణాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా సిపిఎం నేత సురేష్ కుమార్ మాట్లాడుతూ, గసబ పంచాయితీ పరిధిలోని గ్రామాలో లోగిలి, మొర్రిగూడ, నువ్వగూడ, సిరస గూడ, గొందిగూడ గ్రామాల్లో గత రెండు సంవత్సరం క్రితం బిఎస్ఎన్ఎల్ టవర్స్ నిర్మాణం చేశారని చెప్పారు. టవర్స్ నిర్మాణ పనులు పూర్తి చేసి ఏడాది కావస్తున్నా సిగ్నల్ ఇవ్వకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనీ తెలిపారు. సిగ్నల్ లేక ప్రభుత్వ సేవలు కోసం ప్రజలు పంచాయతీ అధికారులు సుదూర ప్రాంతంలో వెళ్లి గంటల తరబడి వేచి ఉండవలసిన పరిస్థితి ఏర్పడుతుందనీ తెలిపారు. వెంటనే సిగ్నల్ సదుపాయం ఇప్పించాలనీ కోరారు. సానుకూలంగా స్పందించిన డివిజన్ ఇంజనీరింగ్ అధికారి సిగ్నల్ ఇవ్వడానికి త్వరతిగతిన ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం యువనాయకుడు పాంగి. జైరాం పాల్గొన్నారు



# సొవ్వలో అడవి తల్లి బాట పేరుతో రహదారి ఘనంగా ప్రారంభం

**సొవ్వ కూటమి పార్టీ నాయకులతో రహదారిని ఘనంగా ప్రారంభం**

**డుంబ్రిగూడ: అక్టోబర్ 05. జయ జయహే.**

అల్లూరి జిల్లా అరకు నియోజకవర్గం డుంబ్రిగూడ మండలం సొవ్వ పంచాయతీ రోడ్ జంక్షన్ నుండి రంగినివలస గ్రామం వరకు తారు రోడ్డు ,1.30 కిలోమీటర్ల దూరం అడవి తల్లి బాట రహదారి ప్రారంభం కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ నిధులతో సుమారు రూ,125.00 లక్షలు అంచనా వ్యయంతో ఈ రోడ్డుని నిర్మించారన్నారు, సొవ్వ కూటమి పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అడవి తల్లి బాటతో రహదారిలు త్రాగునీటి తల్లికి వందనం ఎన్టీఆర్ భరోసా పింఛన్ అన్నదాత సుఖీభవ వంటి వివిధ పథకాలు ప్రజలకు అభివృద్ధి జరుగుతున్నాయని తెలపారు, రంగనివలస గ్రామస్తులు మాట్లాడుతూ. స్వాతంత్రం ఏర్పడి 79, ఏళ్లు అవుతున్న ప్రభుత్వాలు మారినా ప్రభుత్వాలు వచ్చిన రహదారి కష్టాలు ఎదురుకో వలసి వస్తు ఉండేదని చెప్పారు,ఈ సమస్య కూటమి ప్రభుత్వంతోనే ఈ రహదారి నిర్మాణం జరిగిందని వాహనాలు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది గా ఉ ండేదని ఈ రహదారి కు తారు రోడ్డు నిర్మించడంతో రాకపోకలకు ఇబ్బంది లేదని సంతోష వ్యక్తం చేశారు, ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు హాజరై రంగిని వలస గ్రామ రోడ్డును కొబ్బరికాయలు కొట్టి. రిబ్బన్ కట్ చేసి, ఘనంగా ఈ రహదారిని ప్రారంభించారు, ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాంగి మోహన్ దాస్, వంతల లింగమూర్తి, పనస వలస గ్రామ మాజీ వార్డు మెంబర్ రాంబోయి రామ్ చందర్ పడనాయక్ కమలాకర్, వంతల దామోదర్, గుడియా దొన్నో, గ్రామ సచివాలయం అసిస్టెంట్ ఇంజనీరింగ్ అధికారి, సొండింగివలస గ్రామ పూజారి గురువు మట్టం అర్జున్, ఈ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు, కూటమి నాయకులు, స్థానిక ప్రజలు పాంగి కొమ్మేరా , పాంగి రత్తు, సుబ్బాక్కారావు, విజయ్, రాజారావు, తదితరులు పాల్గొన్నారు,

# బీసీ రిజర్వేషన్లకు టీడీపీ కట్టుబడి ఉంది

**వైసీపీ హయాంలో బీసీలకు అన్యాయం జరిగిందన్న గొల్ల నరసింహా యాదవ్**

**తిరుపతి, అక్టోబర్, 05, జయ జయహే**



తిరుపతి బీసీలకు రాజకీయంగా, సామాజికంగా సముచిత ప్రాధాన్యత కల్పించడంలో తెలుగుదేశం పార్టీ ముందుంటుందని రాష్ట్ర టీడీపీ ఉ పాధ్యక్షులు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ అన్నారు. సోమవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు టీడీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం న్యాయపరమైన పోరాటం చేస్తోందని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీ రిజర్వేషన్లు, సంక్షేమ పథకాల విషయంలో అన్యాయం జరిగిందని ఆయన ఆరోపించారు. టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు, నారా లోకేష్ వరకు బీసీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పిస్తూ వచ్చారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం బీసీ సంక్షేమానికి పెద్దపీట వేస్తూ వివిధ పథకాల ద్వారా నిధులు ఖర్చు చేస్తోందన్నారు. బీసీ జనగణన, చట్టసభల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు, స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్ల కోసం టీడీపీ కృషి చేస్తోందని గొల్ల నరసింహా యాదవ్ తెలిపారు. బీసీలకు హక్కులు, అవకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడమే తమ లక్ష్యమన్నారు.

# రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియం పునః ప్రారంభం





**అనకాపల్లి జయ జయహే**

అనకాపల్లి పట్టణ ంలో రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియం ఆధునీకరణతో పునః ప్రారంభం కావడం జరిగింది క్రీడాకారులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందుబాటులో వచ్చాయని మాజీ మంత్రి స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ పేర్కొన్నారు ఎన్టిపిసి లిమిటెడ్ సంస్థ సి ఎస్ ఆర్ నిధులు సుమారు 2.89 కోట్ల వ్యయంతో ఆధునికరించిన రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియం సోమవారం స్థానిక శాసనసభ్యులు కొనతాల రామకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఎన్టిపిసి చీఫ్ జనరల్ మేనేజర్ అయస్కాంత జ్యో న ఈ ఆధునికరించిన స్టేడియం ను ప్రారంభించారు ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటుచేసిన సమావేశంలో కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ అనకాపల్లి ప్రాంతంలో క్రీడారంగానే మరింత అభివృద్ధి చేయడంతో పాటు యువతుల క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియం ఆధునీకరణకు ఎన్టిపిసి సంస్థ ఎంతో సహాయం చేసిందని చాలా అభినందనీయమని ఆయన పేర్కొన్నారు ఆధునికరణ పనులతో స్టేడియం చాలా ఆకర్షణీయంగా మారిందని క్రీడాకారులకు చాలా అనుకూలంగా ఉందని ముఖ్యంగా ఇండోర్ క్రీడలకు అవసరమైన వసతులు మెరుగు పడటంతో స్థానిక క్రీడాకారులతో పాటు జిల్లాస్థాయి రాష్ట్రస్థాయి క్రీడాకారులు కూడా ఈ వేదికను సద్వినియోగం చేసుకునే అవకాశం ఏర్పడిందని క్రీడాలో కేవలం వినోదానికి మాత్రమే పరిమితం కాకుండా యువతుల క్రమశిక్షణ పట్టుదల ఆరోగ్యకరమైన జీవన విధానం పెంపొందించడం కీలక పాత్ర పోషిస్తాయని రామకృష్ణ పేర్కొన్నారు అనకాపల్లి ప్రాంతం నుంచి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచే క్రీడాకారులు వెలుగులోకి రావాలని లక్ష్యంతో క్రీడా మౌలిక వసతులు మరింత బలవబతం చేయవలసిన అవసరం ఉ ందని పేర్కొంటూ స్టేడియం ప్రారంభోత్సవం అనంతరం క్రీడాకాలతో కలిసి బ్యాడ్మింటన్ టోర్నమెంటును ప్రారంభించారు ప్రారంభించారు స్వయంగా షటిల్ ఆడి క్రీడాకారులను ఉ త్సాహపరిచారు ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్, గవరా కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర ఎన్టిపిసి అధికారులు జిల్లా అధికారులు కూటమి నాయకులు క్రీడాకారులు క్రీడ అభిమానులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## కొనసాగుతున్న అంగన్వాడీ ఉత్సవ్ కార్యక్రమాలు

**దేవరాపల్లి, అక్టోబర్ 5, జయ జయహే**

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 25 సంవత్సరాల ప్రజాసేవ సందర్భంగా సేవా సంకల్ప అభియాన్ లో భాగంగా మహిళ శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అంగన్వాడీ ఉత్సవ్ కార్యక్రమాలు విస్తృతంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవం ద్వారా పోషణ, మాతృ సంరక్షణ, టీకాలు సామాజిక సేవలకు సంబంధించిన ప్రభుత్వ కార్యక్రమాలను అంగన్వాడి కేంద్రాలకు వచ్చే లబ్ది దారులకు అనుభవ రూపంలో తెలియజేస్తున్నారు. ప్రతి అంగన్వాడి కేంద్రంలో ఈ కార్యక్రమం మూడు రోజుల పాటు తప్పనిసరిగా నిర్వహించడం జరుగుతుందని .జాతీయ పోషణ మాస ఉత్సవం సెప్టెంబర్ 9 నుండి అక్టోబర్ 8 వరకు జరుగుతున్న నేపథ్యంలో అంగన్వాడీ ఉత్సవాన్ని కూడా పోషణ మాసోత్సవంలోనే నిర్వహించడం జరుగుతుందని సిడిపిఓ లలిత కుమారి తెలిపారు. ఈ కార్యక్రమం మండలం లోని తారువ, చిన గంగవరం, వాకపల్లి గ్రామాలలో అంగన్వాడీ సెంటర్లో సోమవారం జరిగింది. మూడు అంగన్వాడీ కేంద్రాల్లో అంగన్వాడీ కార్యకర్త, ఆయా ఏ ఎన్ ఎంలను ఘనంగా సన్మానించారు. లబ్ధిదారులు అంగన్వాడీ కేంద్రంలో జరుగుతున్న కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమానికి వేచలం పి హెచ్ సి మెడికల్ ఆఫీసర్, అంగన్వాడి సూపర్వైజర్లు ఎన్.కళ్యాణి, ఎం. రాములమ్మ, జి.ఆదిలక్ష్మి, అంగన్వాడీ మానిటరింగ్ కమిటీ తల్లులు, గర్భిణీలు, సచివాలయం సిబ్బందితో పాటు స్థానిక మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



## ప్రారంభమైన దేవీ నవరాత్రి ఉత్సవాలు సందడి

**మాడుగుల అక్టోబర్ ఐదు జయ జయహే**

మాడుగులలో దసరా సందర్భంగా దేవి నవరాత్రి ఉత్సవాల సందడి ప్రారంభమైంది. దానిలో భాగంగా సోమవారం దుర్గాదేవి ఆలయం వద్ద రాటవేశ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈనెల 11 నుంచి 20వ తేదీ వరకు విజయ దశమి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది. ఈ సందర్భంగా జరిగిన రాటవేసే కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పి అప్పలరాజు, ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు ఎస్ శ్రీనివాసరావు, అధ్యక్షుడు ఎస్ వి కొండలరావు, కార్యదర్శి ఏ ఎన్ వి ప్రసాద్, మాజీ సర్పంచ్ కళావతి, మాజీ ఎంపీపీ ధర్మజా, పట్టణ టిడిపి అధ్యక్షుడు పీ లక్ష్మీనారాయణ, కమిటీ సభ్యులు ఎస్ వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు



## శ్రీకాళహస్తీశ్వర స్వామివారి హుండీకి రూ.1.52 కోట్ల ఆదాయం

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 5, జయ జయహే**

శ్రీకాళహస్తి శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దేవస్థానంలో భక్తులు సమర్పించిన హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. గత నెల 9వ తేదీన హుండీ లెక్కింపు నిర్వహించగా, 26 రోజుల అనంతరం సోమవారం మరోసారి హుండీ లెక్కింపు చేపట్టారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి, అమ్మవార్లకు సమర్పించిన కానుకల్లో 37 గ్రాముల బంగారం, 421 కిలోల 700 గ్రాముల వెండి లభించింది. అలాగే భారతీయ కరెన్సీ నోట్ల రూపంలో రూ.1,46,73,913, నాణేల రూపంలో రూ.5,98,253 లభించాయి. దీంతో మొత్తం నగదు ఆదాయం రూ.1,52,72,166గా నమోదైంది. అదేవిధంగా 85 విదేశీ కరెన్సీ నోట్లు లభించినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఈఓ బీకే వెంకటేశులు మాట్లాడుతూ స్వామివారి దర్శనానికి విచ్చేసే భక్తులు భక్తిశ్రద్ధలతో సమర్పించే కానుకలను దేవస్థానం నిబంధనల మేరకు పారదర్శకంగా లెక్కించి, భద్రపరుస్తున్నట్లు తెలిపారు. స్వామివారి సేవా కార్యక్రమాలు, ధార్మిక కార్యక్రమాలకు భక్తులు అందిస్తున్న సహకారానికి దేవస్థానం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఓ బీకే వెంకటేశులు, చైర్మన్ కే. సాయి ప్రసాద్, బోర్డు సభ్యులు గుర్రప్ప శెట్టి, కుసుమ కుమారి, కౌసల్యమ్మ తదితరుల పాల్గొన్నారు.



## న్యాయవాదుల రక్షణ చట్టంపై బార్ అసోసియేషన్ డిమాండ్

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**

న్యాయవాదుల రక్షణ చట్టాన్ని రాష్ట్రంలో తక్షణమే అమలు చేయాలని నిడదవోలు బార్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం నిడదవోలు మండల రెవెన్యూ అధికారికి, మంత్రి కందుల దుర్గేష్ కార్యాలయానికి వేర్వేరుగా వినతిపత్రాలు సమర్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కైకరపు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి అందే విశ్వనాథ్ నేతృత్వంలో వినతిపత్రాలు అందజేశారు. న్యాయవాదులపై దాడులు, బెదిరింపులు పెరుగుతున్న నేపథ్యంలో వారి భద్రతకు రక్షణ చట్టం అత్యవసరమని పేర్కొన్నారు. న్యాయవ్యవస్థ స్వతంత్రంగా, నిర్భయంగా పనిచేయాలంటే న్యాయవాదులకు రక్షణ కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముద్దుకూరి శ్రీనివాసరావు, ఆకుతోట సతీష్ కుమార్, నిడపర్తి భాస్కర్ రావు, యు. ప్రసన్న, ఎస్.కె. జమీలా, ఎల్వే గంగాధర్, వెంకటేశ్వరరావు, ఆర్. వెంకటేశ్వరరావు, ముప్పిడి మంగయ్య, నిడవర్తి రామచంద్రరావు, జి. వివేకానంద, పి. వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



## పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతో చోడవరానికి రూ.502 కోట్ల జల్ జీవన్ మిషన్ నిధులు

**చోడవరం అక్టోబర్ 5,జయ, జయ హే**

అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు జలధార కార్యక్రమాన్ని ప్రొద్దుటూరులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.30,000 కోట్ల విలువైన జల్ జీవన్ మిషన్ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా చోడవరం నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జి పీవీఎస్ఎన్ రాజు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని కలిసి చోడవరం నియోజకవర్గానికి జల్ జీవన్ మిషన్ ద్వారా రూ.502 కోట్లు కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. చోడవరం నియోజకవర్గ ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో ఈ ప్రతిష్టాత్మక పథకానికి అత్యంత ప్రాధాన్యత కల్పించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృషి, పట్టుదల, వ్యక్తిగత చొరవ అభినందనీయమని పీవీఎస్ఎన్ రాజు అన్నారు. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేస్తూ, రాష్ట్ర ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని జల్ జీవన్ మిషన్ నిధులు సాధించడంలో పవన్ కళ్యాణ్ చూపిన ప్రత్యేక శ్రద్ధకు చోడవరం నియోజకవర్గ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. రూ.502 కోట్ల కేటాయింపు చోడవరం నియోజకవర్గ అభివృద్ధిలో ఒక చారిత్రాత్మక ముందడుగని, దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందే అవకాశం ఏర్పడుతుందని పీవీఎస్ఎన్ రాజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ తరపున, కూటమి ప్రజా ప్రతినిధులు తరపున, చోడవరం నియోజకవర్గ ప్రజల తరపున ఉప ముఖ్యమంత్రి పవన్ కి కృతజ్ఞతలు తెలియజేశారు.



## వృద్ధులను ఆదరించడం ప్రతి ఒక్కరి బాధ్యత: బొజ్జల బృందమ్మ

**తొట్టంబేడు, అక్టోబర్ 05, జయ జయహే**

తొట్టంబేడు: అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని తొట్టంబేడు మండలం శివనాథపురం గ్రామంలోని అమ్మ అనాథ మహిళా వృద్ధాశ్రమంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ వృద్ధుల సంక్షేమం, సమాజంలో వారి ప్రాధాన్యతపై మాట్లాడారు. వయసు పైబడిన వారిని ఆదరించడం, వారికి ఆప్యాయత, ప్రేమను పంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని బొజ్జల బృందమ్మ అన్నారు. జీవిత చరమాంకంలో ఉన్న వృద్ధులకు అమ్మలాంటి నీడను అందిస్తూ ఆశ్రయం కల్పిస్తున్న ఆశ్రమ నిర్వాహకుల సేవలను ఆమె అభినందించారు. పెద్దల అనుభవాలు నేటి తరానికి ఎంతో విలువైనవని, వారి సూచనలు సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. వృద్ధులను గౌరవించి, వారి ముఖాల్లో చిరునవ్వు చూడటమే నిజమైన ఆనందమని అన్నారు. అనంతరం ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లు, పౌష్టికాహారం, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. వృద్ధులతో కొద్దిసేపు ఆప్యాయంగా ముచ్చటించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ ప్రతినిధులు, గ్రామస్తులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## వైఎస్సార్‌సీపీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలి

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 05, జయ జయహే**

శ్రీకాళహస్తి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తి పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శ్రీకాళహస్తి మండల విస్తృత స్థాయి సమావేశం ఆయన అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తున్న నాయకులు, కార్యకర్తలకు గుర్తింపు (ఐడీ) కార్డులను పంపిణీ చేశారు. అనంతరం మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి వార్డు, గ్రామంలో ప్రజాదరణ, అంకితభావం కలిగిన అభ్యర్థులను ఎంపిక చేసి వారి విజయానికి పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేయాలన్నారు. కూటమి ప్రభుత్వ బెదిరింపులకు పార్టీ నాయకులు, కార్యకర్తలు భయపడాల్సిన అవసరం లేదని, పార్టీ శ్రేణులకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు పార్టీ తరపున అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. జగనన్న ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ క్షేత్రస్థాయి బలాన్ని దెబ్బతీయడం ఎవరి తరమూ కాదని, 2029 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో తిరిగి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవడమే పార్టీ శ్రేణుల ప్రధాన లక్ష్యమని అన్నారు. రాబోయే రోజుల్లో వైఎస్సార్‌సీపీ భారీ విజయంతో అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి మండల సీనియర్ నాయకులు బత్రి సుదర్శన రెడ్డి, మండల అధ్యక్షులు చెవిరెడ్డి మధుసూదన్ రెడ్డి, చెలికం నాగరాజు రెడ్డి, ప్రసాద్, శివ రాయల్, భాను ప్రకాష్ రెడ్డి, ప్రభాకర్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# వివేకా హత్య కేసులో జగన్ రెడ్డి మౌనం నేరాంగీకారమే

**- పేదవాడి సొంతింటి కలను చిదిమేసింది జగన్ ప్రభుత్వమే**

**- హార్టీకల్చర్ హబ్‌గా 'రాయలసీమ రైజింగ'కు బాటలు వేస్తున్నాం**

**- మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**

**అమరావతి, అక్టోబర్ 5, జయ జయహే :**



సొంత బాబాయ్ వైఎస్ వివేకానందరెడ్డి దారుణ హత్య కేసులో దర్యాప్తు సంస్థలన్నీ ఆధారాలతో సహా తాడేపల్లి ప్యాలెస్ వైపే వేలెత్తి చూపుతున్నా జగన్మోహన్ రెడ్డి నోరు మెదపకపోవడం ముమ్మాటికీ నేరాన్ని అంగీకరించడమేనని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...కడప ఎంపీ టికెట్ కోసం ఏకంగా రూ. 40 కోట్ల భారీ సుపారీ కుమ్మరించి సొంత కుటుంబాన్నే బలితీసుకున్న చరిత్ర జగన్‌ది కాదా అని ప్రశ్నించారు. ఈడీ, సీబీఐ దర్యాప్తు సంస్థలు వేగంగా వాస్తవాలను వెలికితీస్తుంటే సమాధానం చెప్పలేక జగన్ మొహం చాటేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి పదవిని అడ్డం పెట్టుకుని ఐదేళ్ల పాటు ఈ కేసును నీరుగార్చారని, పులివెందులలోకి కేంద్ర దర్యాప్తు అధికారులు అడుగుపెట్టకుండా అడ్డుకున్న చరిత్ర వైసీపీ ప్రభుత్వానిదేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవైపు గొడ్డలి పార్టీ విధ్వంసకర రాజకీయాలు చేస్తుంటే, మరోవైపు కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ప్రొద్దుటూరు వేదికగా సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రూ. 61.60 లక్షల కొళాయిలతో 27.36 లక్షల కుటుంబాలకు తాగునీరు అందించే 'జలజీవన్ మిషన' బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. పల్లె పండుగ 3.0 కింద రూ. 1,185 కోట్లతో సీసీ, బీటీ రోడ్లు, మినీ గోకులాలు, మ్యాజిక్ డ్రైన్ల పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. పీఎంఏవై గ్రామీణ్ 2.0 ద్వారా రాష్ట్రంలో రూ. 7,170 కోట్లతో పేదలకు మూడు లక్షల పక్కా ఇళ్ల నిర్మాణం చేపడుతున్నామని స్పష్టం చేశారు. నాడు వైసీపీ హయాంలో పేదలకు సెంటున్నర స్థలం పేరుతో భూదందాలు చేశారని, కూటమి ప్రభుత్వంలో మాత్రం పారదర్శకంగా సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందిస్తున్నామని వివరించారు. తెలుగుదేశం పార్టీ బీసీలకు ఎల్లప్పుడూ వెన్నెముకగా నిలుస్తుందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయడంతో పాటు అధిక స్థానాలను కేటాయించేందుకు కట్టుబడి ఉన్నామని రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు. గడచిన రెండున్నరేళ్ల కూటమి సుపరిపాలన, అభివృద్ధి, శాంతిభద్రతలే తమకు రామరక్ష అని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభంజనం సృష్టించి చంద్రబాబు గారికి ఘన విజయాన్ని కానుకగా అందిస్తామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## ప్రత్యామ్నాయ రాజకీయ కూటమికి మేధావులు ఏకం కావాలి

**ఆర్పిసి అధ్యక్షులు మేడా శ్రీనివాస్ పిలుపు**

**రాజమహేంద్రవరం: జయ జయహే :అక్టోబర్ 6: ఆంధ్రప్రదేశ్,తెలంగాణ**



రాష్ట్రాల ఉమ్మడికార్యాచరణతోనే కేంద్రంలోని మోదీ ప్రభుత్వ రాజకీయ విధానాలను ఎదుర్కొనగలమని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని మేధావులు, ఉద్యమకారులు ఏకమై ప్రత్యామ్నాయ ప్రజా కూటమి ఏర్పాటుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.రాజమహేంద్రవరంలోని ఆర్‌పీసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన పార్టీ వారాంతపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్ దోపిడీని అడ్డుకుని, తెలుగు రాష్ట్రాల సహజ వనరులు, ఖనిజ సంపదను రాష్ట్రాల అభివృద్ధికే వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. మోదీ ఓటమితోనే రెండు తెలుగు రాష్ట్రాలకు బంగారు భవిష్యత్ సాధ్యమవుతుందని పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రజా సమస్యలు, రాష్ట్రాల భవిష్యత్ కంటే రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నాయని విమర్శించారు. ఇరు రాష్ట్రాల సంపద, వనరులు ఇతర ప్రాంతాల రాజకీయ ప్రయోజనాలకు మళ్లుతున్నాయని ఆరోపించారు. రాష్ట్రాల అభివృద్ధికి అవసరమైన ఆదాయ మార్గాలను పెంచకుండా అప్పులపై ఆధారపడటం ఆందోళనకరమన్నారు.ఎన్నికల వ్యవస్థ, ఈవీఎంలపై ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలు, ఎన్నికల సంఘంపై ఉందన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే వారిపై కేసులు, నిర్బంధాలు పెరుగుతున్నాయనిఆరోపించారు. తెలుగు రాష్ట్రాల్లో పూర్తి స్థాయి రాజకీయ ప్రక్షాళన అవసరమని అన్నారు.రెండు రాష్ట్రాల్లోని సహజ వనరులు, ఖనిజ సంపద, వ్యాపార అవకాశాలను ప్రజల అభివృద్ధికి వినియోగించేలా ప్రజా ఉద్యమానికి సిద్ధం కావాలని మేడా శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ప్రజలు, మేధావులు, ఉద్యమకారులు ఐక్యంగా ముందుకు వస్తే ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిని నిర్మించవచ్చన్నారు. కుహనా పాలకులను, కాలం చెల్లిన రాజకీయ విధానాలను ప్రజాస్వామ్య పద్ధతిలో ఎదుర్కొనేందుకు మహా కూటమిగా ఏర్పడాలని కోరారు.సమావేశానికి ఆర్పిసి సీనియర్ సెక్యులర్ పెండ్యాల కామరాజు అధ్యక్షత వహించారు.సమావేశంలో ఆర్పిసి సెక్యులర్స్ సిమ్మా దుర్గారావు, డి.వి. రమణమూర్తి, దుడ్డే సురేష్, వర్ధనపు శరత్‌కుమార్, కారుమూరి యుగంధర్, దుడ్డే త్రినాద్, వాడపల్లి జ్యోతిష్, జవ్వాది మోహన్, గుడ్ల సాయి దుర్గా ప్రసాద్, బసా సోనియా, చల్లా సాంబశివరావు, చల్లా శివ దుర్గారావు, పాండ్రంకి ఈశ్వరరావు, మట్టపర్తి తులసి, ఎం.కె. ఆలీ, ఎస్.కె. సమీర, కే. ఆంజనేయులు, కే. దుర్గా నవ్యశ్రీ, మాసా అప్పాయమ్మ,త్రిపురాలపాండవులు, దబ్బా కుమారి, అత్తిలి శ్రీనివాసరావు, మాసా సుభద్ర, మాసా అపర్ణ తదితరులుపాల్గొన్నారు.



## ఘనంగా పోషకాహార మాసోత్సవాలు

**చోడవరం అక్టోబర్ 5 జయ జయహే**

రావికమతం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో గల చోడవరం సీతారామ కళ్యాణ మండపంలో సోమవారం ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ ఎస్ ఎన్ రాజు అధ్యక్షతన పోషకాహార మాసోత్సవాలు, అంగన్వాడి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాలన 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా చోడవరం మండలంలో గల 74 మంది అంగన్వాడీ కార్యకర్తలు,ముగ్గురు అంగన్వాడి సహాయకులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ గర్భిణీ బాలింతలకు లోకల్ గా తక్కువ ఖర్చుతో కూడిన ఆహారం ఎంత ప్రయోజకరమని ఆరోగ్యకరమైన బిడ్డకు జన్మనివ్వడానికి ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ సందర్భంగా పెట్టిన వివిధ పోషకాహార వంటలను ప్రభుత్వ నాయకులు రుచి చూశారు. స్టాల్లో గల పోషకాహారం తక్కువ ఖర్చుతో కూడుకొని ఎక్కువ పోషకాలు అందిస్తుందని సిడిపివో వి మంగతయ్య వివరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు గునూరు మల్లు నాయుడు , బిజెపి అధ్యక్షులు రమణమూర్తి , జనసేన మండల అధ్యక్షులు గూడూరు నాయుడు బిజెపి మండల అధ్యక్షులు రాజు, మిగిలిన కూటమి నాయకులు, సూపర్వైజర్లు, అంగన్వాడి కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# త్వరలో విద్యుత్ లైన్‌మెన్ పోస్టుల భర్తీ

**ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడిన కూటమి ప్రభుత్వం**

**ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్**

**ఏపీఈపీడీసీఎల్‌లో 43 మందికి నియామక పత్రాలు అందజేత**

**1912 వినియోగదారులతో స్వయంగా మాట్లాడిన మంత్రి**

**విశాఖపట్నం, అక్టోబర్ 5, జయ జయహే**



విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన విద్యుత్ ఉద్యోగుల కుటుంబాలకు అండగా నిలిచి, వారి కుటుంబ సభ్యులకు త్వరితగతిన కారుణ్య నియామకాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. విశాఖలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని సంస్థలో అర్హులైన 43 మంది అభ్యర్థులకు కారుణ్య నియామక పత్రాలను అందజేశారు. విద్యుత్ శాఖలో మానవ వనరుల కొరతను అధిగమించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. గ్రామ సచివాలయాల్లో ఇంధన సహాయకులుగా పనిచేస్తున్న సిబ్బందిని విద్యుత్ శాఖలోకి తీసుకోవడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 6,500 నుంచి 7,000 మంది వరకు సిబ్బందిని సమకూర్చుకున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యుత్ శాఖపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రతి పది రోజులకు ఒకసారి విద్యుత్ పరిస్థితి, సిబ్బంది, సేవల పంపిణీ తదితర అంశాలపై సమీక్షిస్తున్నారని తెలిపారు. విద్యుత్ శాఖలో సహాయ ఇంజనీర్ పోస్టులను పెంచాలని కోరగా ముఖ్యమంత్రి 629 పోస్టులను ఒకేసారి మంజూరు చేశారని మంత్రి తెలిపారు. ఈ పోస్టులకు పరీక్ష పూర్తయిందని, ఫలితాలను పారదర్శకంగా ఆన్ లైన్‌లో అందుబాటులో ఉంచి, ధ్రువపత్రాల పరిశీలన అనంతరం త్వరితగతిన నియామకాలు చేపడతామని చెప్పారు. దాదాపు లక్ష మంది దరఖాస్తు చేసుకోగా సుమారు 85 వేల మంది పరీక్షకు హాజరయ్యారని, నియామక ప్రక్రియలో ఎలాంటి విమర్శలకు తావులేకుండా పూర్తి పారదర్శకతతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలు అందించేందుకు క్షేత్రస్థాయిలో సిబ్బంది మరింత అవసరమని మంత్రి అన్నారు. 629 సహాయ ఇంజనీర్ పోస్టుల భర్తీ అనంతరం ముఖ్యమంత్రి అనుమతితో లైన్‌మెన్ పోస్టులను కూడా భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా భవిష్యత్ అవసరాలను ముందుగానే అంచనా వేసి విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని చెప్పారు. ఏపీఈపీడీసీఎల్ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్ మాట్లాడుతూ, ఏపీఈపీడీసీఎల్ పరిధి 12 జిల్లాల్లో విస్తరించి ఉందని, సుమారు 30 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన, అనారోగ్యానికి గురైన ఉద్యోగుల కుటుంబాలకు అండగా నిలిచేందుకు కారుణ్య నియామకాలు చేపడుతున్నామని చెప్పారు. 2024లో 37 మందికి, 2025లో 77 మందికి, 2026లో ఇప్పటివరకు 43 మందికి కారుణ్య నియామకాలు చేపట్టినట్లు తెలిపారు. విద్యుత్ శాఖలో ఉద్యోగులు అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో విధులు నిర్వహించాల్సి వస్తుండటంతో ప్రమాదాలు, మరణాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉంటుందని, ఇలాంటి సందర్భాల్లో బాధిత కుటుంబాలకు సంస్థ తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ అండగా నిలుస్తున్నామని తెలిపారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, కష్టాల్లో ఉన్న ఉద్యోగుల కుటుంబాలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కారుణ్య నియామకాలకు ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. విద్యుత్ శాఖ మంత్రి స్వయంగా కార్యక్రమానికి హాజరై నియామక పత్రాలు అందజేయడం అభినందనీయమన్నారు విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ, పార్లమెంటు ఇంధన కమిటీలో సభ్యుడిగా ఉన్న తనకు విద్యుత్ రంగంతో మరింత ప్రత్యక్ష సంబంధం ఏర్పడిందన్నారు. నూతనంగా ఉద్యోగాలు పొందిన వారు తమ వృత్తికి, కుటుంబానికి న్యాయం చేసేలా బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, పి. విష్ణుకుమార్ రాజు, సంస్థ డైరెక్టర్లు టి.వి. సూర్యప్రకాష్, టి. వనజ, ఎస్. హరిబాబు, సీజీఎంలు, ఎసఈలు, ఇతర విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఏపీఈపీడీసీఎల్ 1912 కాల్ సెంటర్‌ను సందర్శించి దాని పనితీరును పరిశీలించారు. వినియోగదారుల నుంచి అందుతున్న ఫిర్యాదులు, వాటిపై సిబ్బంది స్పందిస్తున్న తీరు, ఫిర్యాదుల పరిష్కారానికి తీసుకుంటున్న సమయం తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. వినియోగదారులే కేంద్రబిందువుగా విద్యుత్ సేవలను మరింత మెరుగుపరచాలని, ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి పరిష్కరించే వరకు పర్యవేక్షించాలని సూచించారు.



## అగనంపూడిలో తృప్తి క్యాంటీన్

**ప్రారంభించిన ఎమ్మెల్యే పల్లా**

**అగనంపూడి, అక్టోబర్ 5, జయ జయహే :**

జీవీఎంసీ 102 వార్డ్ అగనంపూడి సెంటర్ బస్ స్టాప్ పక్కన అత్యంత ఆధునికకరమైన డ్వాక్రా మహిళ షేక్ మున్ని రహీం ఏర్పాటుచేసిన తృప్తి క్యాంటీన్‌ను గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రారంభించారు. అనంతరం ఆయన ప్రారంభిస్తూ మహిళలు స్వయం శక్తిగా నిలబడడానికి ప్రభుత్వం ప్రోత్సహిస్తూ మెస్మా ఆధ్వర్యంలో తృప్తి క్యాంటీన్ లో ప్రారంభించడం జరుగుతుందని నాణ్యమైన ఫలహారాలు అందించడం జరుగుతుందన్నారు. జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ పెదిరెడ్ల సత్యవేణి మాట్లాడుతూ మహిళలను ప్రోత్సహించడానికి వారికి ప్రభుత్వం రూ. 11 లక్షల వరకు బ్యాంకు లోనుకు షూరిటి ఇస్తుందని దానిలో కంటైనర్ వంట సామాగ్రి గ్యాస్ సిలిండర్ వాటర్ పైప్ లైన్ కొళాయి విద్యుత్ సౌకర్యం కల్పిస్తుందని తీసుకున్న లోన్ సొమ్ము ఈఎంఐల ద్వారా బ్యాంకునకు కట్టవలసి ఉంటుందన్నారు. జీవీఎంసీలో ఆర్కే బీచ్ వద్ద ఒకటి, షీలా నగర్ దగ్గర ఒకటి భూమి బాబా క్యాన్సర్ హాస్పిటల్ వద్ద ఒకటి శాంక్షన్ అయ్యాయని అన్నారు. అగనంపూడి జోనల్ కమిషనర్ మనిషా త్రిపాటి మాట్లాడుతూ తృప్తి కాంటీన్ యాజమాన్యం పరిశుభ్రంగా ఉంచుతూ నాణ్యమైన ఫలహారాలు అందించాలని కోరారు. మాజీ కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి ప్రసాద్ సివిల్ సప్లై సంస్థ రాష్ట్ర డైరెక్టర్ ప్రసాదుల శ్రీను, ఏ డి సి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ పలువురు కూటమి నాయకులు స్థానిక పురప్రజలు పాల్గొన్నారు.

## బాల సౌజన్య కుమారికి అంతర్జాతీయ ఉపాధ్యాయ రత్న పురస్కారం

**అనకాపల్లి ,(జయ జయహే)**



అక్టోబర్ 5 ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రముఖ విద్యావేత్త తెలుగు ఆచార్యులు ప్రవచన కర్త బాల సౌజన్య కుమారిని తెలంగాణ ఆల్ ద బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ ఆర్గనైజేషన్ తెలంగాణ వారు అంతర్జాతీయ ఉత్తమ ప్రతిభ పురస్కారాలు 2026 లో ఉపాధ్యాయ రత్న పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ సంస్థ ఫౌండర్ ఎస్ సూర్యనారాయణ మాట్లాడుతూ అతి చిన్న వయసులో విద్యా రంగంలో ఎన్నో సేవలు అందిస్తూ సనాతన ధార్మిక సంస్కృతికి సంబంధించిన ప్రవచనాలు ఇస్తూ తరగతి గదిలో దేశ భవిష్యత్తు నిర్మాణం జరుగుతుందని సంతోషాన్ని వ్యక్తం చేసి అభినందనలు తెలియజేశారు. ఇటువంటి అత్యున్నత ప్రతిభా పురస్కారానికి ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందని ఇది కేవలం తల్లిదండ్రులు నన్ను తీర్చిదిద్దిన ఉపాధ్యాయులకి అంకితం ఇస్తున్నానని సౌజన్య కుమారి తెలిపారు.



## కె9ఆధ్వర్యంలో విద్యార్థినికి ఆర్థిక సహాయం

**కొయ్యలగూడెం /జంగారెడ్డిగూడెం:-జయ జయహే**

కొయ్యలగూడెం మండలం కన్నాపురం గ్రామానికి చెందిన బోగిశెట్టి ధాత్రి విద్యార్థిని కి నీట్ ఎగ్జామ్ లో ఆల్ ఇండియా ర్యాంక్ 9277 వచ్చిన సందర్భంగా కాపు సంక్షేమసంస్థ కె9ఆధ్వర్యంలోసోమవారం రూ 20వేలు ఆర్థిక సహాయం చేసినట్టు కె 9అధ్యక్షులు శీలం కృష్ణం రాజు తెలిపారు. కాపు సంఘంనేతలసమక్షంలో ధాత్రిని అభినందించి ఘనంగా సత్కరించి నట్టు పేర్కొన్నారు.ఆమె వైజాగ్ కాలేజీలో ఎంబిబిఎస్ పూర్తి చేయడానికి యాదవోలు గ్రామానికి చెందిన మార్కెటింగ్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ సేనం దొరబాబు సౌజన్యంతో పదివేల రూపాయలు, అలాగే సాయి స్ఫూర్తి హాస్పిటల్ తరఫునడా.సంకుమురళి మరో పది వేలు అందజేశారు.ఈ సందర్భంగా శీలం కృష్ణంరాజు మాట్లాడుతూ మన ప్రాంతానికి ఇంత గుర్తింపు తెచ్చిన ధాత్రి ని అభినందిస్తూ గతంలో కె 9 సంస్థ గ్రూపులో మెసేజ్ పెట్టగా కే9 సంస్థ సభ్యులు కూడా తమ వంతు ఆర్థిక సహాయం చేశారని వివరించారు. ఈ సందర్భంగా దొరబాబు, డా. మురళి స్పందించి ముందుకు రావడం పట్ల ధన్యవాదాలు తెలిపారు.మన మెట్ట ప్రాంతంలో ఉన్నవారు కుల మతాలకు అతీతంగా చదువు కున్న వారు మెడిసిన లేదా ఇతర కోర్సులు చేయడానికి ఆర్థికంగా సహాయం అందించే ముందుగా కనిపించే సంస్థ ఒక కె 9 మాత్రమే అని ఈ ప్రాంతంలో ప్రతి ఒక్కరు నమ్ముతున్నారని అన్నారు

# గ్యాంగ్ రేప్ కేసులో కొత్త ట్విస్ట్

## ఫామ్‌హౌస్‌ల నీడలో గ్యాంగ్‌రేప్ కేసు.. పరారీలో మాజీ ఎమ్మెల్యే, మాజీ కానిస్టేబుల్!





(ప్రతాప్)

మహారాష్ట్రలో సంచలనం రేపిన థానే గ్యాంగ్‌రేప్ కేసు దర్యాప్తు రోజురోజుకూ కొత్త మలుపులు తిరుగుతోంది. సెప్టెంబర్ 17న నమోదైన ఎఫ్ఐఆర్ ప్రకారం, 22 ఏళ్ల యువతి తనను మాజీ బీజేపీ ఎమ్మెల్యే నరేంద్ర పవార్ మరియు మాజీ పోలీసు కానిస్టేబుల్ శైలేష్ పాటిల్ పద్ఘా ప్రాంతంలోని ఒక ఫామ్‌హౌస్‌కు తీసుకెళ్లి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారని ఆరోపించింది. బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదైన తర్వాత ఇద్దరూ పరారీలోకి వెళ్లిపోయారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ ఇద్దరి కోసం పోలీసులు విస్తృత స్థాయిలో గాలింపు చర్యలు చేపట్టగా, దర్యాప్తులో వెలుగులోకి వస్తున్న వివరాలు కేసును మరింత సంచలనంగా మారుస్తున్నాయి.




దర్యాప్తు అధికారుల సమాచారం ప్రకారం, నేరం జరిగినట్లు ఆరోపణలు ఉన్న ఫామ్‌హౌస్ శైలేష్ పాటిల్ పేరుమీదే నమోదై ఉంది. ఇదే సమయంలో పాటిల్ మరియు అతని భార్య పేర్లపై ముంబై మెట్రోపాలిటన్ ప్రాంతంలో మొత్తం 17 ఫామ్‌హౌస్‌లు ఉన్నాయనే సమాచారం పోలీసులకు అందింది. ఇప్పటివరకు ఏడు ఫామ్‌హౌస్‌లకు సంబంధించిన ఆధారాలను అధికారులు గుర్తించగా, మిగిలిన పది ఆస్తుల వివరాలను ధృవీకరిస్తున్నారు. మాజీ కానిస్టేబుల్ స్థాయిలో పనిచేసిన వ్యక్తి ఇంత భారీ స్థాయిలో ఆస్తులు ఎలా కూడబెట్టాడనే ప్రశ్న ఇప్పుడు దర్యాప్తులో కీలక అంశంగా మారింది. అతని పేరు మరొకరి ఆస్తులకు ముసుగుగా ఉపయోగించబడిందా అనే కోణంలో కూడా పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

కేసుకు మరో సంచలన కోణాన్ని జోడించింది పాటిల్ తల్లి సులోచన చేసిన ఆరోపణలు. ఎఫ్ఐఆర్ నమోదైన కొద్దిరోజులకే ఆమె మీడియా ముందుకు వచ్చి, తన కుమారుడు తనపై కూడా దాడి చేశాడని ఆరోపించింది. అంతేకాకుండా అతడికి మరణశిక్ష విధించాలని బహిరంగంగా డిమాండ్ చేసింది. ఒక ఐపీఎస్ అధికారిని కాపాడేందుకు తన కుమారుడు ప్రయత్నించాడని కూడా ఆమె ఆరోపించింది. మరోవైపు, 2013లో లంచం కేసులో అరెస్టై సస్పెండ్ అయిన పాటిల్, 2019లో తిరిగి విధుల్లో చేరిన రెండో రోజే స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకొని పోలీసు శాఖను వీడినట్లు దర్యాప్తులో బయటపడింది.

కేసులో మరిన్ని అనుమానాలకు తావిచ్చిన అంశం సీసీటీవీ ఆధారాల మాయం కావడం. కేసు వెలుగులోకి వచ్చిన కొన్ని రోజులకే ఫామ్‌హౌస్‌లోని సీసీటీవీ కెమెరాలు, డిజిటల్ వీడియో రికార్డర్ (డీవీఆర్) కనిపించకుండా పోయినట్లు పోలీసులు గుర్తించారు. భివాండి-కల్యాణ్ మధ్య జాతీయ రహదారి సమీపంలోని ఏకాంత ప్రదేశంలో ఉన్న ఈ ఫామ్‌హౌస్ ప్రస్తుతం దర్యాప్తు కేంద్రంగా మారింది. ఆరోపణలను ఖండిస్తున్న నరేంద్ర పవార్, తనపై రాజకీయ కుట్ర జరుగుతోందని పేర్కొంటూ పార్టీ పదవులకు రాజీనామా చేసినప్పటికీ, పోలీసులు మాత్రం పరారీలో ఉన్న ఇద్దరిని గుర్తించేందుకు ముమ్మర గాలింపు కొనసాగిస్తున్నారు. గ్యాంగ్‌రేప్ ఆరోపణలతో ప్రారంభమైన ఈ కేసు ఇప్పుడు భారీ ఆస్తులు, అదృశ్యమైన డిజిటల్ ఆధారాలు, రాజకీయ అనుబంధాలు, పరారీలో ఉన్న నిందితులు వంటి అనేక ప్రశ్నలతో మహారాష్ట్రలో తీవ్ర చర్చకు దారితీస్తోంది.

# రూ. 2.89 కోట్లతో ఓపెన్ జిమ్ ప్రారంభం

**అనకాపల్లి అక్టోబర్ 5, జయ జయహే :**





అనకాపల్లిలోని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియం మరియు ఓపెన్ జిమ్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఎన్‌టీపీసీ సీఎస్సార్ నిధులతో రూ.2.89 కోట్ల వ్యయంతో ఆధునీకరించబడిన రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియాన్ని ప్రముఖ అతిథులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపాలిటీ కమిషనర్ చేతన్ గార్గ్, ఎన్‌టీపీసీ చీఫ్ జనరల్ మేనేజర్ అయస్కాంత జెనా, శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇంచార్జి, మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ సంభవరపు గణేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అలాగే కూటమి కుటుంబ సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్, తెలుగుదేశం పార్టీ ఇంచార్జి, మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ, ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేసిన ఇండోర్ స్టేడియం యువతకు క్రీడా రంగంలో మరింత ప్రోత్సాహాన్ని అందిస్తుందని, ఓపెన్ జిమ్ ప్రజల ఆరోగ్య సంరక్షణకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

# మానసిక ఆరోగ్య అవగాహన వారోత్సవాలు-2026

**అక్టోబర్ 4 నుండి 10వ తేదీ వరకు**
**మూడవరోజు ప్రత్యేక శీర్షిక**

### విద్యార్థులుకు పరీక్షల సమయంలో అధిక భయం

విద్యార్థి దశలో పరీక్షలు సర్వసాధారణము. 1వ తరగతి నుండి మొదలైన ఈ పరీక్షలు విద్యను కొనసాగిస్తున్న ప్రతి తరగతిలో ఉంటాయి. పరీక్ష భయం అనగా చదవకపోవడంతో వచ్చే భయం కాదు. దీనిని సైకాలజీలో Text anxiety అని అంటారు. ఇది ఒక మానసిక ఒత్తిడి కొద్దిగా భయం ఉండడం మంచిది. ఎందుకంటే శ్రద్ధగా చదివేలా చేస్తుంది. కానీ భయం అనేది మితిమీరి ఉండడం వలన మానసిక కృంగబాటుకు గురై మనోవేదనకు దారితీస్తుంది. Performance anxiety ఉండడం వలన పరీక్షకు ముందు పరీక్ష సమయంలో విపరీతమైన భయం, గుండెదడ, చమటలు పట్టడం, మతిమరుపు, కళ్ళు తిరగడం,తీవ్ర వేదనకు గురి అవ్వడం జరుగుతూ ఉంటాయి.

"మీకు కూడా ఉందా పరీక్షల పోబియా పరీక్షా భయాన్ని అధిగమించే పద్ధతులు".

**పరీక్ష భయం ఎందుకు వస్తుంది :-**

1. అభిజ్ఞాన వాస్తవికత

విద్యార్థుల్లో ఏది ప్రతికూల ఆలోచనలను సృష్టించుకునే ఒక మానసిక స్థితి ఒక చిన్న విషయంలో లేదా పరీక్షల్లో ఎప్పుడైనా వైఫల్యం చెందితే ప్రతిసారి ఇలా వైఫల్యం ఉంటుందేమో అని ఆలోచన. విషయాలను ఎక్కువగా ఆలోచన చేసినప్పుడు ఇలా ఈ కృంగబాటు జరగవచ్చును.

2. తల్లిదండ్రులు మరియు సమాజ ఒత్తిడి:-

మార్కులే జీవితం అనే భావన పిల్లల్లో ఈ భయాన్ని రెట్టింపు చేస్తుంది. ఎప్పుడైతే ప్రతిరోజు సమాజం తల్లిదండ్రులు ఎక్కువ మార్కులు రావాలి అని ప్రోత్బలిస్తారో ఈ మనోవేదన అధికమవుతుంది.

3. తన పైన తనకు నమ్మకం లేకపోవడం-

విద్యార్థి ఆలోచన చేయడం వలన ఒక్కోసారి తన పైన తనకు నమ్మకం కోల్పోతాడు. తీవ్రమైన భయాందోళనకు




గురై పరీక్ష సమయంలో భయాన్ని రెట్టింపు చేస్తుంది.

**పరీక్ష భయం లక్షణాలు:-**

సాధారణంగా విద్యార్థులు పరీక్ష సమయంలో భయానికి కారణమైన మూడు ముఖ్య లక్షణాలు ఉంటాయి.

1. శారీరక లక్షణాలు

తలనొప్పి కడుపునొప్పి గుండె వేగంగా కొట్టుకోవడం నిద్ర పట్టకపోవడం చేతులు వణకడం.

2. మానసిక లక్షణాలు

పరీక్షలు దగ్గర పడుతున్నాయి అనగా చదివింది గుర్తు రాకపోవడం, మెదడు నియంత్రణ లేకపోవడం, చిరాకు, కోపం, నిస్సత్తువు గా ప్రతిసారి ఏడుపు విద్యార్థి కలిగి ఉంటాడు.

3. ప్రవర్తన లక్షణాలు:-

పరీక్షలకు వెళ్లకుండా తప్పించుకోవడం కోసం ఎదురుచూడడం ఇంట్లో నుండి పారిపోవడం చదవకుండా శాఖలు చెప్పి అక్కడినుండి తప్పించుకుని కనిపించకుండా తిరగడం.

**మనో విశ్లేషణ శాస్త్ర ప్రకారం - పరీక్షల సమయంలో పిల్లలకు అవగాహన :-**

విద్యార్థులకు సలహాలు (సి బి టి )

1.ఆలోచనలు సానుకూలంగా ఉంచుకోవడం. నాకు రాదు నేను రాయలేను అనే విషయాన్ని పూర్తిగా విడిచిపెట్టి నేను ప్రయత్నిస్తాను మార్కులు ఒకటే జీవితం కాదు ప్రయత్నం అనేది అతి ముఖ్యమైన అంశం అని తనకు తాను చెప్పుకోవడం.

2. దీర్ఘ శ్వాస తీసుకోవడం. పరీక్షల భయం అనిపించినప్పుడు ప్రతిసారి నాలుగు సెకండ్లు ఒకసారి గట్టిగా గాలి పీల్చడం ఏడు సెకండ్ నుంచి పెట్టడం చేస్తే నాడీ వ్యవస్థ ప్రశాంతతను ఇస్తుంది.

3. సహాయ నిర్వహణ పద్ధతి

విద్యార్థి దీని ద్వారా ఒక సమయపాలనలో చదవడం నేర్చుకుంటారు మధ్యలో గ్రామం తీసుకుని మళ్ళీ టైమర్ సెట్ చేసుకుని ఆ సమయంలో శ్రద్ధగా చదవడం చేస్తే ఆరోగ్యాన్ని తగ్గి ఏకాగ్రత పెరుగుతుంది మానసిక భక్తుడికి దూరమై ప్రశాంతంగా చదువుకోవచ్చు ఏకాగ్రత పెంచడానికి సరైన విధానం ఇది.

తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు పరీక్ష సమయంలో భయాన్ని దూరం చేసే ముఖ్య సూచనలు

విద్యార్థులను ఇతర విద్యార్థులతో అస్సలు పోల్చకూడదు. వారి యొక్క ప్రయత్నాన్ని మెచ్చుకొని అభినందిస్తూ ఉండాలి. వైఫల్యం అనేది విజయానికి తొలిమెట్టు అని తెలియచెప్పాలి. ఆత్మవిశ్వాసంతో రాసేవే పరీక్షలు అని నిరంతరం చెప్తూ ఉండాలి. పరీక్షకు ముందు రోజు నూతన పాఠ్యాంశాన్ని చదవకుండా పదేపదే పునరావృతం పాత పాఠ్యాంశాలను మాత్రమే చేయనివ్వాలి. 200% భరోసా,ఆత్మవిశ్వాసం వీటి వలన విద్యార్థులకు లభిస్తుంది.

**రచన**
**ఏ బాల సౌజన్యకుమారి**
**తెలుగు ఆచార్యులు,**
**నంది అవార్డు గ్రహీత**
**ఆధ్యాత్మికవేత్త,**
**ప్రవచనాకర్త.**





## పట్టాదారి పాసుపుస్తకాలు పంపిణీ

**అనంతగిరి, జయ జయహే**

అనంతగిరి మండలం, పెదకోట పంచాయతీ బొడ్డ పూటు లో రీసర్వే పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ కార్యక్రమం పెదకోట గ్రామ పంచాయతీ పరిధిలోని బొడ్డపుట్టు రెవెన్యూ గ్రామానికి సంబంధించి పంపిణి చేయడం జరిగింది. గ్రామస్థుల సమక్షంలో ఆ గ్రామంలో సాగు చేస్తున్న రైతులు ఎవరైతే ఉన్నారో పట్టాదారుల కు మంజూరైన పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా వీఆర్వో ఆది రెడ్డి రవి మాట్లాడుతూ, పట్టాదారులకు పాస్‌పుస్తకాల ప్రాముఖ్యత, భూమి వివరాల పరిరక్షణ మరియు భవిష్యత్‌లో అవసరమైన రెవెన్యూ సేవల వినియోగంపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమానికి కూటమి ప్రభుత్వ నాయకులు టిడిపి ఎక్స్ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి జే దేముడు, పెదకోట టిడిపి క్లస్టర్ ఇంచార్జి కే గణేష్, కూటమి కార్యకర్తలు, రెవిన్యూ సచివాలజి సిబ్బంది పాల్గొన్నారు.



## సీఎం సహాయ నిది ద్వారా మహిళకు రూ.3.85 లక్షల మంజూరు

**ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపిన బాధితులు**

**జంగారెడ్డిగూడెం, జయ జయహే**

ఆపదలో ఉన్నవారికి అండగానేనని మరోసారి చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ మరోసారి తన పెద్ద మనసు చాటుకున్నారు.జంగారెడ్డిగూడెం రూరల్ మండలం లక్కవరం గ్రామానికి చెందిన బాకి శ్యామల అత్యవసర చికిత్స కోసం ఆస్పత్రిలో చేరారు. ఆర్థిక ఇబ్బందులలో ఉన్న ఆమె కుటుంబానికి సోమవారం ఎమ్మెల్యే రోషన్ కుమార్ దృష్టికి వెళ్లగా ప్రభుత్వం సహాయం అందించినట్టు తెలిపారు. సీఎం సహాయ నిధి ద్వారా రూ.3,85,000/- మంజూరు చేయించి బాధిత కుటుంబానికి అందజేశారు.ఆపద సమయంలో ఆదుకున్న ఎమ్మెల్యే రోషన్ కుమార్ కు బాధిత కుటుంబం, లక్కవరం గ్రామ తెలుగుదేశం పార్టీ నేతలు కృతజ్ఞతలు తెలిపారు.



## గిరిజన సంక్షేమ రెసిడెన్సీయల్ స్కూల్‌కు స్వచ్ఛ అవార్డ్

**అభినందనలు తెలిపిన కలెక్టర్ వెట్రి సెల్వి**

**జంగారెడ్డిగూడెం-జయ జయహే**

బుట్టాయిగూడెంలోని గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల కు రాష్ట్ర స్థాయి 'స్వచ్ఛ అవార్డు' లభించిండం అభినందనీయమని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. బుట్టాయిగూడెం లోని గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల సిబ్బంది తమ పాఠశాల సాధించిన రాష్ట్రస్థాయి 'స్వచ్ఛ అవార్డు' ను సోమవారం స్థానిక కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ కు తెలియజేసి తమ సంతోషాన్ని కలెక్టర్ తో పంచుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ మారుమూల గ్రామంలోని గిరిజన సంక్షేమ రెసిడెంటిల్ పాఠశాల రాష్ట్రస్థాయి అవార్డు ను సాధించడం గొప్పవిషయమని, జిల్లాలోని పాఠశాలలలకు స్ఫూర్తిదాయంగా నిలిచారన్నారు. ఈ అవార్డును జిల్లాలో ప్రతీ పాఠశాల సిబ్బంది స్ఫూర్తిగా తీసుకుని రానున్న సంవత్సరంలో మరిన్ని రాష్ట్ర అవార్డులు సాధించేలా కృషి చేయాలన్నారు. గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల సిబ్బంది ఇదే ఒరవడిని కొనసాగించాలని సూచించారు

## శ్రీనివాస్‌కు సేవ రత్న అవార్డు

**మాడుగుల,అక్టోబర్ 5, జయ,జయహే**



సమాజ సేవలో విశిష్ట సేవలు అందించడంతో మాడుగులకు చెందిన ప్రముఖ వర్తకులు ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐ.వి.యఫ్ )అనకాపల్లి జిల్లా అధ్యక్షులు శ్రీనాథు శ్రీనివాస రావు కు అరుదైన పురస్కారం లభించింది. ఆదివారం విజయవాడ గొల్లపూడి ఆర్ కన్వెన్షన్ లో ఐ వి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కోన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో శ్రీనాథు శ్రీనివాసరావుకు సేవా పురస్కారాలు 2026 కార్యక్రమంలో భాగంగా సేవ రత్న అవార్డు ప్రధానం చేసి శాలువా తో సత్కరించి జ్ఞాపిక ప్రశాంసపత్రాన్ని అందించారు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1,
BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com